


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 125 | మంగళవారం 05 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3


## అమరావతి చంద్రబాబుకు బంగారు బాతు:



## ఎన్నికల విజయాన్ని కరూర్ మృతులకు అంకితం చేసిన టీవీకే పార్టీ

**కరూర్ తొక్కిసలాట మృతులకు టీవీకే తమ చారిత్రక విజయం అంకితం**

**తమిళనాడు ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన నటుడు విజయ్ పార్టీ**

**మహిళల మద్దతుతోనే గెలిచామని, ఇది ఒక విప్లవమని పార్టీ నేతల వ్యాఖ్య**

**ఎమ్మెల్యేల ఫిరాయింపుల భయంతో రిసార్టుకు తరలించే యోచనలో టీవీకే**

**టీవీకేతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ సంసిద్ధత, అధిష్ఠానానికి నివేదిక**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ గెలుపును కరూర్ తొక్కిసలాట మృతులకు అంకితమిచ్చింది. ఎన్నికల ప్రచారంలో జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. "ఈ చారిత్రక విజయాన్ని కరూర్‌లో మనం కోల్పోయిన 41 మంది కుటుంబాలకు అంకితమిస్తున్నాం" అని టీవీకే నేత ఆధవ అర్జున ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి, ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన డీఎంకే, ఏఐఏడీఎంకేల

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్



**తమిళనాడు ఎన్నికల్లో విజయం దిశగా టీవీకే**

**నటుడు విజయ్‌కు అభినందనలు తెలిపిన నారా లోకేశ్**

**విజయ్ ఎన్నికల అరంగేట్రం అద్భుతమని ప్రశంస**

**ప్రజల అంచనాలకు అనుగుణంగా బాధ్యతతో పనిచేయాలని ఆకాంక్ష**



## ద్రవిడ కోటను బద్దలుకొట్టిన విజయ్..

### ఆరు దశాబ్దాల చరిత్రకు బ్రేక్

**తమిళనాడు ఎన్నికల్లో సంచలనం సృష్టిస్తున్న నటుడు విజయ్ పార్టీ**

**అధికారానికి చేరువలో తమిళగ వెట్రి కళగం (టీవీకే)**

**ఆరు దశాబ్దాల డీఎంకే, ఏఐఏడీఎంకేల పాలనకు ముగింపు సంకేతాలు**

**అధికార డీఎంకేకు ఊహించని భారీ పరాజయం**

**కొన్ని ప్రాంతాల్లో బలపడిన ఏఐఏడీఎంకే**

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

**ఏపీ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా నిలపాలన్న సీఎం చంద్రబాబు**

**పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి**

**రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ**

**పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి**

**ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్క్.. యువతకు ఉపాధి కల్పన**



ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి

## అమెరికాలో ఎంపీ శ్రీభరత్..

**ఏపీకి పెట్టుబడులు ఆకర్షించేలా కీలక సమావేశం**




**విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ప్రవాసాంధ్రులకు ఎంపీ శ్రీభరత్ పిలుపు**

**రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోందని వెల్లడి**

**పరిశ్రమలకు దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్న ఎంపీ**

**మంత్రి లోకేష్ చొరవతో దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయని వివరణ**

**జులై మొదటి వారంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుందని వెల్లడి**

# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

**భారత రాజ్యాంగాన్ని బలపరచిన ఎన్నికలు**

**భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ఎన్నికలు**

**బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి**

**గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం**

**అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం**

**తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా**

**బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ**



ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచెకట్టుతో వచ్చారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ

## విజయ్‌కి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశా:



**టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించిందన్న రాహుల్ గాంధీ**

**ప్రస్తుతం యువగళం పెరుగుతోందని వ్యాఖ్య**

**ప్రజా సమస్యలపై పోరాటం కాంగ్రెస్ కొనసాగిస్తుందన్న రాహుల్ గాంధీ**

## భవానీపూర్‌లో మమతా బెనర్జీకి భారీ షాక్..



# ద్రవిడ కోటను బద్దలుకొట్టిన విజయ్..

తమిళనాడు రాజకీయాల్లో ఒక ఊహించని బ్లాక్‌బస్టర్... ఎవరూ అంచనా వేయని ఒక అద్భుతమైన స్క్రిప్ట్ ఆవిష్కృతమైంది. ఆరు దశాబ్దాలకు పైగా ద్రవిడ పార్టీల ఆధిపత్యంలో ఉన్న రాజకీయ చరిత్రను తిరగరాస్తూ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) చారిత్రక విజయం దిశగా దూసుకెళుతోంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి, అధికారాన్ని కైవసం చేసుకునే అంచున నిలిచి, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

**వ్యూహాలు.. ఫలితాలు** 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మధ్యాహ్నం 1 గంట సమయానికి టీవీకే రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు గానూ 107 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మేజిక్ ఫిగర్‌కు కేవలం 11 సీట్ల దూరంలో నిలిచింది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ద్రవిడ దిగ్గజాల మధ్య నూతన శక్తిగా బరిలోకి దిగిన టీవీకే, అందరి అంచనాలను తలకిందులు చేసింది. 1962లో కె. కామరాజ్ నేతృత్వంలోని కాంగ్రెస్ తర్వాత తమిళనాడులో ఒక ద్రవిడేతర పార్టీ అధికారం చేపట్టడం ఇదే ప్రథమం కానుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ ఎన్నికల్లో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అయితే, ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయం లేదనుకున్న ఓటర్లకు విజయ్ ఒక కొత్త 'ఎంపిక'ను అందించారు. పెరియార్ సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని తన ప్రచారంలో జోడించి, డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై, ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ ఆశీస్సులు తనకు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారు.

**డీఎంకేకు కోలుకోలేని దెబ్బ**ఈ ఫలితాలు డీఎంకేకు కోలుకోలేని దెబ్బ. వరుస విజయాలతో దూకుడు మీద ఉన్న స్టాలిన్ పార్టీకి ఇది ఊహించని పరాజయం. 2011లో జయలలిత చేతిలో ఓటమి తర్వాత డీఎంకే పదేళ్ల పాటు రాజకీయంగా ఇబ్బందులు పడింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి తలెత్తవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఏఐఏడీఎంకేకు పునరుజ్జీవం** మరోవైపు ఈ ఎన్నికల ఫలితాలు ఏఐఏడీఎంకేకు ఒకరకంగా పునరుజ్జీవం లాంటివి. నాయకత్వ లేమి, ముఖ్య నేతలు పార్టీని వీడటంతో బలహీనపడిందని భావించినప్పటికీ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో పట్టు నిలుపుకొని ఆశ్చర్యపరిచింది. ఓటమి పాలైనా, పార్టీ పునర్నిర్మాణానికి ఈ ఫలితాలు ఒక బలమైన పునాది వేశాయని చెప్పవచ్చు. మొత్తం మీద ఈ ఎన్నికలు తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి.

## అమెరికాలో ఎంపీ శ్రీభరత్.. ఏపీకి పెట్టుబడులు ఆకర్షించేలా కీలక సమావేశం

ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక చోదకశక్తిగా, గ్రోత్ ఇంజన్‌గా ఎదుగుతున్న విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ ప్రవాసాంధ్రులకు (ఎన్ఆర్ఐ) పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఆయన, కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలను ఉద్దేశించి శ్రీభరత్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం దిశగా పరుగులు పెడుతోందని అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే వినూత్న విధానాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతులను వేగంగా మంజూరు చేయడంతో పాటు, దేశంలోనే మరే రాష్ట్రం అందించనటువంటి అత్యుత్తమ ప్రోత్సాహకాలను ఏపీ అందిస్తోందని వివరించారు. ఈ సానుకూల వాతావరణం ఫలితంగానే ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ, స్వదేశీ పెట్టుబడుల్లో ఏకంగా 25 శాతానికి పైగా వాటాను ఏపీ దక్కించుకుంటోందని గణాంకాలతో సహా తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో గ్లోబల్ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని శ్రీభరత్ పేర్కొన్నారు. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని, తద్వారా వేలాది ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. అదేవిధంగా, టెక్ దిగ్గజం గూగుల్, ఉక్కు తయారీలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఆర్సెలర్ మిట్టల్ వంటివి కూడా తమ ప్రాజెక్టుల పనులను ఇప్పటికే ప్రారంభించాయని వెల్లడించారు. మరోవైపు, ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం చివరి దశకు చేరుకుందని, జులై మొదటి వారంలోనే దీనిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కీలక ప్రాజెక్టులతో విశాఖ ప్రాంతం పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోందని, కాబట్టి ఎన్ఆర్ఐలు పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సువర్ణావకాశమని ఆయన ఉద్ఘాటించారు. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అన్ని వసతులు విశాఖలో ఉన్నాయని, పెట్టుబడులతో ముందుకువచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏ ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు వెంకట్ కోగంటి, శ్రీకాంత్ దొడ్డపనేని, భక్త భల్లా, సుధీర్ ఉన్నం, హరి సన్నిధి, విజయ్ ఆసూరి, శశి దొప్పలపూడి తదితరులు పాల్గొన్నారు.

## భవానీపూర్‌లో మమతా బెనర్జీకి భారీ షాక్..

**భవానీపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓటమి**

**బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో రెండోసారి పరాజయం**

**గతంలో నందిగ్రామ్‌లోనూ మమతను ఓడించిన సువేందు**

**ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి రెండింటిలోనూ గెలిచిన సువేందు అధికారి**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం నమోదైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తన సొంతగడ్డ భవానీపూర్ నియోజకవర్గంలో ఓటమి చవిచూశారు. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె పరాజయం పాలయ్యారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఎదురైన ఓటమికి ప్రతీకారంగా ఈసారి భవానీపూర్ నుంచి బరిలోకి దిగినా, ఫలితం మారకపోవడం గమనార్హం. ఎన్నికల సంఘం వెల్లడించిన ఫలితాల ప్రకారం, సువేందు అధికారికి 73,917 ఓట్లు రాగా, మమతా బెనర్జీకి 58,812 ఓట్లు మాత్రమే లభించాయి. దీంతో 15,105 ఓట్ల మెజారిటీతో సువేందు అధికారి ఘన విజయం సాధించారు. సువేందు చేతిలో మమత ఓడిపోవడం ఇది వరుసగా రెండోసారి. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో జరిగిన హోరాహోరీ పోరులోనూ సువేందు చేతిలోనే ఆమె ఓటమి పాలయ్యారు. మరోవైపు, సువేందు అధికారి ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి, రెండింటిలోనూ గెలుపొంది రికార్డు సృష్టించారు. భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నియోజకవర్గంలోనూ పోటీ చేయగా, నందిగ్రామ్‌లో తృణమూల్ అభ్యర్థి పబిత్ర కర్ పై 9,665 ఓట్ల తేడాతో ఆయన విజయం సాధించారు. ముఖ్యమంత్రిపై వరుసగా రెండుసార్లు గెలవడం, రెండు నియోజకవర్గాల్లోనూ జయకేతనం ఎగురవేయడంతో సువేందు అధికారి బెంగాల్ రాజకీయాల్లో మరింత బలమైన నేతగా అవతరించారు. బెంగాల్ సీఎం రేసులో సువేందు అధికారి ముందున్నారు.

## విజయ్‌కి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశా: రాహుల్ గాంధీ ట్వీట్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. టీవీకే పార్టీ అధినేత విజయ్‌తో మాట్లాడానని, పార్టీ సాధించిన అద్భుతమైన ఫలితానికి ఆయనను అభినందించానని పేర్కొన్నారు.ప్రస్తుతం యువగళం పెరుగుతోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రజల కోసం పార్టీ పని చేస్తుందని హామీ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 100కు పైగా స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 70కి పైగా, అన్నాడీఎంకే 50కి పైగా స్థానాలతో సరిపెట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలలో బీజేపీ, మిత్రపక్షాలు విజయం సాధించాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారం చేజిక్కించుకుంది.

## అసోంలో సీఎం హిమంత బిశ్వ శర్మ ఘన విజయర

అసోం అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఘనవిజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి నుంచి హిమంత ఏకంగా 89,434 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులను చిత్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బిదిష నియోగ్‌కు కేవలం 37,717 ఓట్లు మాత్రమే రావడంతో హిమంత వ్యక్తిగత క్రేజ్ ఏంటో మరోసారి స్పష్టమైంది. హిమంతకు 1,27,151 ఓట్లు వచ్చాయి. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల విషయంలో హిమంత అనుసరించిన కఠిన వైఖరి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుండి విముక్తి కల్పించడం ఆయనకు అన్ని వర్గాల మద్దతు తెచ్చిపెట్టింది. చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లాదేశ్ ప్రకటనలను సమర్థవంతంగా తిప్పికొట్టడం, వరద నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలు ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. ఎన్ఆర్‌సీ అమలు, చొరబాట్లకు శాశ్వత అడ్డుకట్ట వేస్తామన్న బీజేపీ హామీ ఓటర్లలో నమ్మకాన్ని కలిగించింది.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

**అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బిజెపి**

**బెంగాల్లో పాగా వేసిన బిజెపి..మట్టి కరిచిన మమతా బెనర్జీ**

**కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం**

**తమిళనాట విజయ్ కొత్త కెరటం**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదుచ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది. కేరళలో పదేళ్ల తరవాత మళ్లీ కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాట ద్రవిడ పార్టీలకు పరాభవం తప్పలేదు.

## కేరళలో మూడు సీట్లు గెల్చుకున్న బిజెపి

కేరళలో పదేళ్ల తర్వాత భాజపా ఖాతా తెరచింది. నేమోం, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తమకు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, సీపీఎంలు చేసిన వ్యాఖ్యలకు ఈ ఫలితాలే సమాధానమని కాషాయ పార్టీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తాను పోటీ చేసిన కంజిరప్పల్లిలో మూడో స్థానంలో నిలిచారు. నేమోం స్థానంలో రాజీవ్ చంద్రశేఖర్ తన సమీప అభ్యర్థిపై 4,978 ఓట్ల తేడాతో గెలుపొందారు. చాతన్నూర్‌లో బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ 428 ఓట్ల తేడాతో గ్టటెక్కారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా తొలిసారి 2016లో ఓ సీటు సాధించింది. నేమోం నియోజకవర్గం నుంచి సీనియర్ నేత రాజగోపాల్ గెలిచారు. 2021లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. కేరళలో మొత్తం 140 స్థానాలు ఉండగా.. తాజా ఫలితాల్లో 102 స్థానాల్లో విజయంతో యూడీఎఫ్ సెంచరీ కొట్టినట్లయ్యింది. 2021 ఎన్నికల్లో 62 స్థానాల్లో గెలిచిన ఎల్డీఎఫ్.. ఈ సారి 35కే పరిమితమైంది. ధర్మదం నుంచి పోటీ చేసిన సీఎం పినరయి విజయ్ 19,247 ఓట్ల తేడాతో గెలుపొందారు.

## అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. 126 స్థానాలు ఉన్న అసోంలో బిజెపి వందకు పైగా సీట్లను గెల్చుకుని తిరుగులేదని నిరూపించింది. ఇక్కడ కాంగ్రెస్ నేత గోగోయ్ అపజయం పాలయ్యారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. హిమంత సైతం తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన బిదిష నియోగ్‌కు 31,951 ఓట్లు పోలయ్యాయి. హిమంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2021 నుంచి అస్సాంలో బీజేపీకి కీలకనేతగా నిలిచారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను వ్యతిరేకించడం, ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుంచి విముక్తి కలిగించడంతో ముఖ్యమంత్రిగా అన్ని ప్రధాన వర్గాలుగా చేరువయ్యారు. ముఖ్యంగా చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లా ప్రకటనలు తిప్పికొట్టడం, బెలూచిస్థాన్ స్వాతంత్ర పోరాటానికి మద్దతుగా నిలవడం, అసాంలో వరద నివారణ చర్యలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బంగ్లా చొరబాట్లకు పూర్తి అడ్డుకట్ట వేస్తామని, ఎన్ఆర్‌సీని కచ్చితంగా అమలవుతుందని ఆయన చేసిన ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. ప్రధానమంత్రి మోదీ సైతం హిమంత్ బిశ్వ శర్మ ప్రచారానికి దన్నుగా నిలవడంతో అస్సాంలో బీజేపీ తిరుగులేని విజయాన్ని మరోసారి సొంతం ంది.

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు. సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాలన్నారు. 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాలు-పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా. బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించినందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. స్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతో ముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. బీజేపీ-ఎన్డీయేకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కేరళ ప్రగతి కోసం, వికసిత కేరళం విజన్ సాకారం కోసం తాము పనిచేస్తామని చెప్పారు. కేరళం ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ టీవీకేను ప్రధాని అభినందించారు. ఎన్డీయేకు మద్దతుగా ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలు, వారి జీవనప్రమాణాల మెరుగుదలకు తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. తమిళనాడు ప్రగతి, ప్రజాక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి తదితరులు పాల్గొన్నారు.

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకుపోతూ, రాజకీయ అరంగేట్రంలో సత్తా చాటిన నటుడు విజయ్‌కు ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ ఎన్నికల ప్రస్థానం అద్భుతంగా మొదలైందని ఆయన ప్రశంసించారు.ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ, "తమిళనాడులో విజయ్ పార్టీ (టీవీకే) నమోదు చేస్తున్న అద్భుతమైన ఎన్నికల విజయాల పట్ల నా అభినందనలు. ఈ ఫలితాలు రాష్ట్ర ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయి. విజయ్ ఘనత తమిళనాడు రాజకీయ యవనికపై ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్న విజయ్‌కు శుభం కలగాలని లోకేశ్ ఆకాంక్షించారు. "ప్రజల అంచనాలను అందుకుంటూ, బాధ్యతతో, అంకితభావంతో విజయ్ పనిచేస్తారని ఆశిస్తున్నాను" అని లోకేశ్ తన సందేశంలో వివరించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.

# కేరళ క్యాబినెట్‌లో 13 మంది మంత్రుల ఓటమి...

# ధర్మదంలో గట్టెక్కిన సీఎం విజయన్

కేరళ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధికార లెఫ్ట్ కూటమికి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని క్యాబినెట్‌లో మెజారిటీ మంత్రులు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమికి తీవ్ర భంగపాటు ఎదురైంది. పినరయి క్యాబినెట్‌లోని 21 మంది మంత్రులకు గాను 20 మంది పోటీ చేయగా, వారిలో ఏకంగా 13 మంది ఓటమి పాలయ్యారు. తుది ఫలితాలు ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, యూడీఎఫ్ 102 స్థానాల్లో, లెఫ్ట్ కూటమి 35, ఎన్డీయే 3 స్థానాల్లో విజయం సాధించాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్మదం స్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ, ఆయన ప్రజాదరణ తగ్గినట్లు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2021లో 50,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన ఆయన, ఈసారి ఆరో రౌండ్ లెక్కింపు వరకు వెనుకంజలో ఉన్నారు. చివరికి కేవలం 19,400 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గట్టెక్కారు.గెలిచిన మంత్రుల్లో ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్, పర్యాటక మంత్రి పీఏ మహమ్మద్ రియాస్, మత్స్యశాఖ మంత్రి సాజి చెరియన్ (సీపీఎం) ఉన్నారు. వీరితో పాటు రెవెన్యూ మంత్రి కే. రాజన్, ఆహార శాఖ మంత్రి జీఆర్ అనిల్, వ్యవసాయ మంత్రి పీపీ ప్రసాద్ (సీపీఐ) కూడా తమ సీట్లను నిలబెట్టుకున్నారు. అయితే ఓటమి పాలైన వారిలో వీణా జార్జ్, వీఎన్ వాసవన్, ఎంబీ రాజేశ్, వీ శివన్‌కుట్టి వంటి కీలక సీపీఎం మంత్రులు ఉండటం గమనార్హం. మిత్రపక్షాలకు చెందిన మంత్రులు సైతం ఓటమిని చవిచూశారు. ఈ ఫలితాలు అధికార ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



# పద్మావతి నగర్ లో పరుపుల దుకాణం ప్రమాదానికి కారకులు ఎవరో తెలుసా.



**ఓ కళాశాల,ఓ హోటల్ యాజమాన్యాల నిర్లక్షం.**

**25 లక్షలు విలువచేసే పరుపుల దుకాణం కాలిపోయింది.**

**దుకాణం యజమానికి న్యాయం జరిగేనా.**

**ప్రవేటు కళా శాల,హోటల్ లో నిన్న రాత్రి ఆనందంతో టపాకాయలు కాల్చారు.**

**పరుపుల అంగడి ఉందని కాల్చవద్దని బ్రతిమిలాడినా కనికరం మంట గలిసిపోయింది.**

**ఇద్దరు ఆనందం..పేదోడి జీవితం బుగ్గిపాలు.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 4 ( నంది పత్రిక )** ఇంటర్ ఫలితాలలో...కళాశాల వార్షికోత్సవం....హోటల్ వార్షికోత్సవం ఏమి జరిగిందో ఏమో ఎవరికి తెలియదు.పద్మావతి నగర్ లో రాత్రి ఓ కళాశాల, ఓ హోటల్ వద్ద సంబరాలు చేసుకొని టపాకాయలు కాల్చడంతో ఓ పేదవాడి బతుకు బుగ్గిపాలు అయింది.వేడుకలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న పరుపుల దుకాణం యజమాని ముందుగానే ఇక్కడ టపాకాయలు కాల్చితే పరుపుల దుకాణానికి ప్రమాదం సంభవిస్తుందని వేడుకున్నా కనికరం లేకుండా డబ్బు,అధికారం,రాజకీయ పలుకుబడి ముందు పేదోడి మాటలను లెక్కచేయలేదు.పలితంగా 25 లక్షలు విలువచేసే పరుపుల దుకాణం మంటల్లో మాడిపోయింది.వివరాల్లోకి వెళితే పద్మావతి నగర్ లో ఒక పరుపుల దుకాణం కొన్నేళ్లుగా ఉంది.ఆ దుకాణం సమీపంలో ఒక కళాశాల,ఎదురుగా ఒక హోటల్ ఇటీవల ప్రారంభం అయ్యాయి.నిన్న రాత్రి ఆ కళాశాల,ఆ హోటల్ వద్ద ఏమి ఘనకార్యం సాధించారో భారీగా టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.అంతకు ముందు పరుపుల దుకాణం యజమాని మీరు ఇక్కడ టపాకాయలు కాల్చితే మాకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పినా నీ కోసం మేము సంబరాలు చేసుకోవద్దా అని గదమాయించినట్టు తెలుస్తోంది.ఎట్టకేలకు రాత్రి భారీగా టపాకాయలు కాల్చడంతో నిప్పురవ్వలు పరుపుల దుకాణం లో పడటంతో వెంటనే దుకాణం అంతా వ్యాపించింది.ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునే లోపలే జరగరాని ఘోరం జరిగిపోయింది.బాధితుడు కళ్ళ నీళ్ళ



పర్యంతం అవుతూ దాదాపు 20 నుంచి 30 లక్షలు విలువ చేసే పత్తి,దూది,పరుపులు,వాటికి ఉపయోగించే బట్టలు,మెటీరియల్ కాలిపోయాయి ,ఓ కళాశాల,ఓ హోటల్ యజమానులు నిన్న రాత్రి టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి నా బతుకు బుగ్గపలైందని ఆరోపిస్తున్నారు.అధికారులు,నేతలు పెద్ద మనసు చేసుకొని న్యాయంచేయాలని కోరుతున్నారు.వారు డబ్బు,పలుకుబడి, ఉన్నవారు కాబట్టి న్యాయం జరుగుతుందో లేదో వేచిచూద్దాం.



# నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణ



**నంద్యాల ప్రతినిధి. మే 04. (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం అన్నప్రసాద వితరణ చేసినట్లు లయన్ పెసల శ్రీకాంత్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సమన్వయకర్త తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా నంద్యాల ప్రభుత్వా సర్వజన ఆసుపత్రిలో వచ్చు పేషెంట్ల సహాయకులకు అన్న ప్రసాద వితరణ ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు మరియు సాయంకాలం ఏడు గంటలకు చేస్తున్నట్లు తెలిపారు.సోమవారం కీర్తిశేషులు చందా లక్ష్మీదేవి వర్ధంతి సందర్భంగా కుమారుడు చంద్రమోహన్ భార్య కృష్ణవేణి కుటుంబ సభ్యుల సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించామన్నారు.నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దూరప్రాంతాల నుంచి వైద్యం కొరకు ఎంతోమంది వస్తుంటారని వారికి ప్రత్యనిత్యం అన్న ప్రసాదం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ చంద్రమోహన్, ఇమ్మడి రామకృష్ణుడు ,లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ నాగరాజు,ట్రెజరర్ జనార్ధన్,లయన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.



**డోన్. మే 04 . (నంది పత్రిక ):**ఈ నెల 9, 10 వ తేదీన నెల్లూరు లో జరుగుతున్న ఆవాజ్ 3 వ రాష్ట్రమహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సి పీ యం పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీల సమావేశానికి హుస్సేన్ భాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో అవాజ్ కమిటీ నియోజకవర్గం అధ్యక్షులు జలదుర్గం అబ్దుల్ రసూల్,ప్రధాన కార్యదర్శి ఎస్ఏ చిన్న రహిమాన్లు మాట్లాడుతూ కేంద్రంలో మూడవ సారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం తమ మతోన్మాద కార్పొరేట్ రాజకీయం నడుస్తుందని ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో దేశ సమైక్యత సమగ్రతను కాపాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం, లోకిక శక్తులతో కలిసి అవాజ్ విశేష కృషి చేస్తుందని, రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సబ్ ప్లాన్ చట్టం,దుల్హాన్ పథకం, 10 శాతం రిజర్వేషన్,మౌజన్, ఇమాములకు జీతాలు పెంపు,అనేక సమస్యలపై ఆవాజ్ పోరాటం చేసిందని వారన్నారు.భవిష్యత్తులో ఈ మతోన్మాద దాడులను అరికట్టుటకు, మైనారిటీలను చైతన్య పరచడానికి, అభివృద్ధి పరచడానికి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆవాజ్ నాయకులు తెలిపారు.ఈసమావేశంలో ఖాజా హుస్సేన్, మహమ్మద్ రఫీ, షేక్షావలి, ఖాజా, ఖాదర్ బాషా, మహబూబ్ బాషా హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

# గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో ఎండల తీవ్రత ఉండటం వలన ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు ..



**చలివేంద్రం ప్రారంభించిన విద్యుత్ శాఖ డీ.ఈ.లు శ్రీనివాస్,నాగేశ్వరావు..**

**నంద్యాల సిటీ బ్యూరో మే 4 ( నంది పత్రిక )** పట్టణంలోని స్థానిక నూనె పల్లె విద్యుత్ కార్యాలయం బయటి ఆవరణలో గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో కౌలు రైతుల సహకారంతో ఈరోజు విద్యుత్ శాఖ అధికారులు ఇద్దరు డీ.ఈ.లు శ్రీనివాస్,నాగేశ్వరావుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు డి.ఈ. శ్రీనివాస్ డీ.ఈ. నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా మార్చి, ఏప్రిల్,మే నెలలో వేసవికాలం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని గోళ్ళ రాజేష్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్ర ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ఈ చలివేంద్రం వల్ల వచ్చిపోయే బాటసారులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం చేత బయట వాటర్ బాటిళ్లు కొనాలంటే డబ్బులు వెచ్చించాలి అలా కాకుండా ఉచిత చలివేంద్రం పెట్టడం వల్ల ప్రతి ఒక్కరికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని డి.ఈ. శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కార్యనిర్వహకులు రిపోర్టర్ నూర్ భాషా మాట్లాడుతూ విద్యుత్ శాఖ కార్యాలయం బయట ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తామని అడగ్గానే సానుకూలంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు డి.ఈ శ్రీనివాస్, డీ.ఈ.నాగేశ్వరరావు అలాగే విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు అందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా నంద్యాల జిల్లా కేంద్రం అవడం వల్ల చుట్టుపక్కల పరిసర ప్రాంతాల నుండి ప్రభుత్వ కార్యాలయాలకు తమ సొంత కార్యక్రమాలకు ప్రజలు వచ్చి తమ కార్యక్రమాలు నిర్వహించుకొని వెళ్తుంటారు ఈనేపధ్యంలో వేసవి కాలం కావడం వల్ల ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల దాహార్తి కూడా పెరుగుతుందని అందుబాటులో చలివేంద్రము ఉండటం వల్ల ప్రజలకు దాహార్తిని తీర్చి ఎండ వేడిని తగ్గించేందుకు ఉపశమనంగా ఉంటుందని భావించి గోళ్ళ రాజేష్ అన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని



ఏర్పాటు చేయడం జరిగిందని ఇలాంటి కార్యక్రమాలకు ఇప్పటికే నంద్యాల పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ఇప్పటికే ఎన్నో రకాలుగా నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు రిపోర్టర్ నూర్ భాషా. ఈ కార్యక్రమానికి సహకరించిన కౌలు రైతులకు జిల్లా అధ్యక్షులు, నర్సింహులు, ఉపాధ్యక్షులు మార్కు, సహాయ కార్యదర్శి.. ఏలియా,కార్యవర్గ సభ్యులు ఓబ్లేస్ కు..ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విధంగా గోళ్ళ రాజేష్ భవిష్యత్తులో ఇంకా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ వెళ్లాలని భవిష్యత్తులో అందరం కూడా రాజేష్ అన్న నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు మాకు అందిస్తున్న మదిన్ షావలి, మహబూబ్,హాజి సలాం, ఇలా ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

**సప్లిమెంటరీలో ఉత్తీర్ణతే లక్ష్యం: అధికారులకు దిశానిర్దేశం**

**విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి - స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచనలు**

**3,375 మంది ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక కార్యాచరణ**

**రెమెడియల్ క్లాసులతో విద్యార్థులకు నూతన ఆశలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 04(నంది పత్రిక):-** పదవ తరగతి పరీక్షల్లో విఫలమైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లా పదో తరగతి ఫలితాలు రాష్ట్ర స్థాయిలో మెరుగ్గా ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3,375 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విఫలమవ్వగా, తెలుగులో కూడా విద్యార్థులు ఫెయిల్ కావడం గమనార్హమని చెప్పారు. ఒకటి, రెండు లేదా మూడు సబ్జెక్టుల్లో విఫలమైన విద్యార్థుల వివరాలను సవివరంగా విశ్లేషించి, వారికి తగిన విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రతి రోజు ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 మందికి పైగా విద్యార్థులు విఫలమైన పాఠశాలలలోనే ఈ తరగతులు నిర్వహించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఈ తరగతులను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, విద్యార్థుల్లో నమ్మకం కలిగించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల డేటా సేకరణకు సంబంధించి తల్లిదండ్రుల సరైన ఫోన్ నంబర్లను నమోదు చేసి డేటాను శుద్ధి చేయాలని ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను సంప్రదించే ప్రయత్నాల్లో అనేక ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను సరిదిద్ది తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, అధికారుల పనితీరులో బాధ్యతాయుత ధోరణి అవసరమన్నారు. తనిఖీలకు సంబంధించిన ఫోటోలను గ్రూపుల్లో కాకుండా నేరుగా తమకు పంపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను కనీసం 10 శాతం పెంచే దిశగా కృషి చేయాలని, నాణ్యత లేని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న యూనిఫాంలు, విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలని అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది మరియు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మొదటి తరగతిలో అడ్మిషన్లను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డీఈఓ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పశ్చిమ బెంగాల్,అస్సాం, పుదుచ్చేరిల్లో కమల వికాసం..







**నంద్యాలలో భాజపా విజయోత్సవాలు..**

**మోదీ చిత్రపటానికి పాలాభిషేకం.**

**ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఈ విజయానికి సోపానాలు**

**వాజ్‌పేయి విగ్రహానికి నివాళి..**

**సంబరాల్లో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 4 ( నంది పత్రిక )** అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జైత్రయాత్ర కొనసాగించడం, పశ్చిమ బెంగాల్‌లో అనూహ్య ఫలితాలు సాధించడంపై జిల్లా కేంద్రం నంద్యాలలో సంబరాలు మిన్నంటాయి. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ ఎత్తున విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

**మోదీ చిత్రపటానికి పాలాభిషేకం** దేశవ్యాప్తంగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ తన సత్తా చాటడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి డాక్టర్ అభిరుచి మధు పాలాభిషేకం చేశారు. మోదీ నాయకత్వానికి దేశవ్యాప్తంగా ప్రజలు మరోసారి బ్రహ్మరథం పట్టారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

**వాజ్‌పేయికి నివాళులు.. మిఠాయిల పంపిణీ** అనంతరం పార్టీ దిగ్గజం, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సందడి చేశారు.నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలకు కూడా మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు.బీజేపీ సిద్ధాంతాలకు, అభివృద్ధి కాంక్షకు ఈ గెలుపు నిదర్శనమని అభిరుచి మధు పేర్కొన్నారు.

**ప్రజల తీర్పు అమోఘం: డాక్టర్ అభిరుచి మధు** ఈ సందర్భంగా డాక్టర్ అభిరుచి మధు మాట్లాడుతూ.. "అస్సాంలో వరుసగా రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం, పుదుచ్చేరిలో పాగా వేయడం కార్యకర్తల కష్టానికి ఫలితం. ముఖ్యంగా బెంగాల్‌లో గతంతో పోలిస్తే బీజేపీ సాధించిన స్థానాలు దేశ రాజకీయాల్లో ఒక సంచలనం. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఈ విజయానికి సోపానాలు" అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# అంగరంగ వైభోగంగా శ్రీ రామకృష్ణ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం





## -పాఠశాల అభివృద్ధికి ప్రణాళిక

**నంద్యాల ప్రతినిధి. మే 04. (నంది పత్రిక ):** శ్రీ రామకృష్ణ విద్యాలయం, నంద్యాల 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దాదాపు 160 మంది పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను మళ్లీ ఆస్వాదించారు. కార్యక్రమం ఉపాధ్యాయులకు సత్కారం, అనుభవాల పంచుకోలు, వినోదాత్మక ఆటలు, పాటలు, నృత్యాలతో కళకళలాడింది. ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సుదీర్ఘ ప్రసంగాలు కాకుండా ఆటపాటలతో నృత్యాలతో ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించడం ఆహ్లాదంగా అనిపించింది. ప్రస్తుత సోషల్ మీడియా వేదికల ద్వారా పూర్వ విద్యార్థులు ముందే అనుసంధానమై ఉండటంతో ప్రత్యేక పరిచయాల కార్యక్రమం నిర్వహించలేదని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయంలో వచ్చిన సూచనలను గౌరవంగా స్వీకరిస్తూ, భవిష్యత్తులో మరింత సమగ్రంగా కార్యక్రమాలను ప్రణాళిక చేయనున్నట్లు ఒక పూర్వ విద్యార్థి, నిర్వాహకులలో ఒకరైనటువంటి లయన్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఈ సమ్మేళనం మా జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. పాత స్నేహాలను మళ్లీ గుర్తు చేసుకునే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది," అని ఒక పూర్వ విద్యార్థి దుబాయ్ నుండి వచ్చిన ఆర్కిటెక్ట్ భాను ప్రకాష్, బెంగళూరు నుండి వచ్చిన బ్యాచ్ ౦౦ఎ టాపర్ సంపత్ లు పేర్కొన్నారు. అందరి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. ముఖ్యంగా నంద్యాల ప్రాంత పూర్వ విద్యార్థులు ధనుంజయ్, శివ రమేష్, సుబ్బయ్య, మురళి, చంద్ర మోహన్, రమణ, శ్రీను రమణా రెడ్డి తదితరులు చేసిన కృషి ప్రశంసనీయం," అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు మరియు ఆర్థికంగా సహకరించిన అందరికీ పూర్వ విద్యార్థులు రైల్వే ఆఫీసర్ శైలేంద్ర, విద్యుత్ శాఖ అధికారి కృష్ణమూర్తి, నీటి పారుదల శాఖ అధికారి విజయ్ తదితరులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల చైర్మన్ నివర్తి మోహన్ కుమార్ మరియు విశ్రాంత ఉపాధ్యాయులు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, నరసింహ రావు, మల్లికార్జున శెట్టి , రామ్మూర్తి , సుబ్బరాయుడు ఇలాంటి సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య బంధాన్ని మరింతబలపరుస్తాయని, భవిష్యత్తులో కూడా ఇవి కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ నగరాల నుండి దేశాలనుండి దూర ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం, కుటుంబ సమేతంగా పెద్ద విశేషం. ఈ విశేషం పురస్కరించుకుని గత నెలలోనే పాఠశాలలో దాదాపు లక్షకు పైగా విలువైన ఫ్లోరింగ్, వాటర్ ట్యాంక్, పెయింటింగ్ తదితర మరమ్మతులు బ్యాచ్ తరపున చేపట్టడం జరిగింది. పూర్వ విద్యార్థులైన రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ ఇకమీదట పాఠశాల అభివృద్ధికి ఒక ప్రణాళిక తయారు చేసుకుని స్కూలు యాజమాన్యంతో చర్చించి, ఇతర పూర్వ విద్యార్థుల బ్యాచులతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు.





## ప్రభుత్వ జొన్న కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి షరతులు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలి

### రైతుల సొంత ట్రాక్టర్లను రవాణా కోసం ఉపయోగించుకోవాలి.



**నంద్యాల ప్రతినిధి. మే 04. (నంది పత్రిక ):** ప్రభుత్వం ఏర్పాటుచేసిన జిల్లా కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలులో ప్రభుత్వం విధించిన షరతులను రద్దుచేసి మొత్తం పంటను కొనుగోలు చేయాలని, రవాణా విషయంలో ఆలస్యం జరగకుండా ఉండేందుకే అదనపు వెహికల్స్ ఏర్పాటు చేయాలని రైతుల సొంత ట్రాక్టర్లను కూడా అధికారులు ఉపయోగించుకోవాలని, అకాల వర్షాలు మరియు అగ్ని ప్రమాదాల వారిని పడి కళ్ళల్లో జొన్నలు ఉన్న రైతాంగం నష్టపోకుండా ఉండేందుకు త్వరితగతిన జొన్నలు కొనుగోలు చేయాలని కోరుతూ నేడు కలెక్టర్ కార్యాలయం ముందు గడివేముల మండలం రైతులు ధర్నా నిర్వహించి, వీఆర్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడు, జొన్న రైతు సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సంజీవరెడ్డి తో పాటు పెసరవాయి,బూజనూరు, కరిమద్దెల, ఎం .చింతకుంట, గోస్పాడు రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ సురేష్, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గత నెలలో జరిగిన ధర్నా అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నకొనుగోలు కేంద్రాల ఏర్పాటు లో ఆలస్యం జరగటం, ఏర్పాటు అయిన తర్వాత కేవలం ఒక్క గ్రామానికి ఒక్క వెహికల్ మాత్రమే పంపడం మూలంగా ప్రతిరోజు కేవలం నాలుగు ఐదు రైతులకు నుంచి మాత్రమే జొన్నలు కొనుగోలు జరుగుతున్నది. ఎక్కువ మంది రైతులు కల్లాల్లో జొన్నలు నిల్వపెట్టుకొని ఎప్పుడు అకాల వర్షాలు పడతాయో, ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతాయోనని భయంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగేఎలుకలు ,పందికొక్కుల వల్ల జొన్న సంచులకు డ్యామేజ్ ఏర్పడినష్టంజరుగుతున్నందువల్ల కొనుగోలు వేగ వంతం చేస్తారని ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు జొన్నలను తరలించడం కోసం ఏర్పాటు చేసిన వెహికల్స్ చాలా తక్కువగా ఉండడంతో ఆలస్యం ఎక్కువ జరుగుతున్నది. అంతేకాకుండా కేవలం 5 ఎకరాల వరకు మాత్రమే, ఎకరాకు 20 కింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని పరిమితులు విధించడం వల్ల అదనంగా పొలం సాగు చేసిన రైతులు మిగిలిన జొన్నలు ఎలా అమ్ముకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రైతాంగం పండించిన మొత్తం జొన్నలను ప్రభుత్వమే ఎలాంటిపరిమితులు లేకుండా కొనుగోలు చేయాలని, రవాణా కు అవసరమైన వెహికల్స్ సంఖ్య పెంచాలని, రైతుల సొంత ట్రాక్టర్లను కూడా రవాణా కోసం ఉపయోగించుకొని కొనుగోలు వేగవంతం చేయాలని తద్వారా రైతులకు నష్టం జరగకుండా చూడాలని కోరుతూ డిఆర్ఓకి వినతిపత్రం సమర్పించారు. అందుకు డిఆర్ఓ వెంటనే జిల్లా సివిల్ సప్లై అధికారిని పిలిపించి రైతులతో మాట్లాడించగా, అధికారి మాట్లాడుతూ నిన్నటి వరకు కొనుగోలు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని, కాంట్రాక్టు విషయంలో జరిగిన ఆలస్యం వల్ల లేట్ అయిందని, రేపటి నుండి ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు అదనపు వెహికల్స్ ఏర్పాటు చేస్తామని, అవసరం అయితే రైతుల ట్రాక్టర్లు కూడా వినియోగించటానికి ఈరోజు సాయంత్రం లోగా సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొనుగోలు లోవిధించిన పరిమితులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు రామచంద్రుడు మరియు జొన్న రైతుల నాయకుడు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జొన్న పండించిన రైతులందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారంపై విశ్వాసం పెంపొందించాలి

**13 మండలాల్లో ఒక్క ఫిర్యాదు కూడా లేకపోవడం.. గ్రీవెన్స్ వ్యవస్థపై అసంతృప్తి -**

**అధికారులకు షోకాజ్ నోటీసులు**

**కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు ముందు కేపీఐలు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలి**

**జిల్లా ర్యాంకింగ్ ను మెరుగుపరచండి**

**ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో ఆర్డీఓల ప్రత్యక్ష భాగస్వామ్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 04(నంది పత్రిక):-** ప్రజా సంతృప్తి పెంపు, సేవల మెరుగుదల, సమయానుకూల పరిష్కారం లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పునరుద్ఘాటించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆ నమ్మకాన్ని ప్రతి అధికారి ప్రజల్లో కలిగించాల్సిన బాధ్యత ఉందన్నారు. గత వారం 13 మండలాల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డీఆర్ఓ ను ఆదేశించారు. ఈ నెల 7, 8 తేదీలలో జరిగే కలెక్టర్ల సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని, అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను (కేపీఐలు) తక్షణమే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ పారామీటర్ల ఆధారంగానే జిల్లాకు ర్యాంకింగ్ నిర్ణయించబడుతుందని తెలిపారు.

**గ్రీవెన్స్ వ్యవస్థ బలోపేతానికి కొత్త విధానం** జిల్లా కేంద్రంలో రోజుకు 300-400 వరకు గ్రీవెన్స్ దరఖాస్తులు వస్తున్నాయని, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే ప్రజలు కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆర్డీఓలు నేరుగా పాల్గొని తమ డివిజన్‌కు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్ అనంతరం వారితో సమీక్ష నిర్వహించి పరిష్కారాలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రజలు స్థానిక స్థాయిలోనే న్యాయం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక్క గ్రీవెన్స్ నమోదు కాని మండలాల అధికారులపై చార్జెస్ ఫ్రేమ్ చేయాలని, సంబంధిత అధికారులు ఈ నెల 11 వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాను రాష్ట్రంలో మొదటి 10 స్థానాల్లో నిలపాలని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఏ విభాగం 14వ ర్యాంక్




కంటే దిగువన ఉంటే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ప్రస్తుతం కొన్ని విభాగాల్లో జిల్లాకు తక్కువ ర్యాంకులు రావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఆన్‌లైన్ సేవలు – పెండింగ్ పనులపై దృష్టి** వివిధ శాఖలకు సంబంధించిన ఆన్‌లైన్ ఎంట్రీలు సమయానికి చేయకపోవడం వల్లే ర్యాంకులు పడిపోతున్నాయని పేర్కొన్నారు. లేబర్, ఫిషరీస్, ఇండస్ట్రీస్ వంటి శాఖల పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశాలకు సమర్పించే నివేదికలు సంక్షిప్తంగా, స్పష్టంగా ఉండాలని, పథకం లక్ష్యాలు మరియు సాధించిన ఫలితాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను సమయానికి సమర్పించాలని ఆదేశించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ – వినూత్నతకు ప్రాధాన్యం** జిల్లాలో వినూత్న పద్ధతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల పునరుద్ధరణ, డానిష్ ఫైబర్ రోడ్ల నిర్మాణం, తక్కువ ఖర్చుతో వ్యవసాయంలో నైలాన్ స్ట్రిప్స్ వినియోగం వంటి ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్‌కు సంబంధించిన నిధులు, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు వంటి పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ఏ విభాగంలోనూ జిల్లా పేరు తక్కువ పనితీరుతో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పి జి ఆర్ ఎస్ పై కలెక్టర్ అసంతృప్తి



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 4 :** మండల కేంద్రంలో ప్రతి సోమవారం నాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకుగాను పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. అయితే ప్రజలు మండల కేంద్రాలను వదిలి జిల్లా కేంద్రానికి వచ్చి సమస్యల రూపంలో దరఖాస్తులను సమర్పించడాన్ని జిల్లా కలెక్టర్ తప్పు పట్టినట్లుగా తెలిసింది. మండలాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించకపోవడం వల్లే ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు ఉండటం పై కలెక్టర్ సంబంధిత అధికారులపై తీవ్ర సంతృప్తి వ్యక్తం చేసినట్లుగా సమాచారం. ఈ విషయంపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఇకనుండి ప్రతి సోమవారం నాడు జరిగే పి జీఆరెస్ కార్యక్రమంలో సంబంధిత ఆర్డీవోలు పాల్గొని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినట్లుగా తెలుస్తోంది. బండిఆత్మకూరు మండలంలో నిర్వహించే పి జి ఆర్ ఎస్ కు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయా లేదా? అన్న విషయాలను అధికారులు బహిర్గతం చేయడం లేదు. వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తున్నారా లేదా అన్న అనుమానం కూడా తలెత్తుతూ ఉంది. మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారులందరూ సోమవారం నాడు పి జి ఆర్ ఎస్ కు హాజరవుతూనే ఉన్నారు. అయితే ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పాత్రికేయులకు తెలియజేయకపోవడం వింతగాను విడ్డూరంగాను ఉంది. సోమవారం నాడు జరిగిన పి జి ఆర్ సి కు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందని ఓ అధికారి పేర్కొనడం గమనార్హం. మండలంలోని కొన్ని గ్రామాలలో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందింది. ఈ విషయాన్ని సంబంధిత ట్రాన్స్కో అధికారిని ప్రశ్నిస్తే, గ్రామాలలో వీధిలైట్లకు సంబంధించి స్విచ్ ఆన్ సిస్టమును ఏర్పాటు చేసుకోవాలని, అది కూడా గ్రామపంచాయతీ కార్య దర్శిలే దీనికి పూనుకోవాలని చెప్పడం కొసమెరుపు.

## కేరళలో కాంగ్రెస్ గెలుపు.. తాను చేసిన ప్రచారాన్ని గుర్తుచేసుకుంటూ రేవంత్ రెడ్డి ట్వీట్

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాను కేరళలో ప్రచారం చేసిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం



సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులు అంటూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, వేణుగోపాల్, దీపాదాస్ మున్షీలకు కూడా అభినందనలు తెలిపారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎంతోమంది యూడీఎఫ్ మద్దతుదారులు, కేరళ ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపించారని గుర్తు చేసుకుని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధిని విశ్వసిస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా దశాబ్ద కాలం పాటు అన్యాయాన్ని ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికాయని అన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

# ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి



**బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి**

**రీఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి అవసరం**

**పీజీఆర్ఎస్‌కు 272 దరఖాస్తులు స్వీకరణ**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 27(నంది పత్రిక):-** ప్రజా సమస్యలను నిర్దిష్ట గడువు (ఎస్ఎల్ఏ) లోపే వేగంగా పరిష్కరించి, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారుల లాగిన్‌లలో ఉన్న అర్జీలను వెంటనే పరిశీలించి, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 123 అర్జీలు ఓపెన్ చేయకుండా ఉన్నాయని పేర్కొంటూ, వాటిని తక్షణమే పరిష్కార దిశగా తీసుకెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో 280 రీఓపెన్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల పరిధిలో రీఓపెన్ అయిన కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన కేసులు అధికంగా రీఓపెన్ అవుతున్నాయని, సంబంధిత అధికారులు సమగ్రంగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 159 అర్జీల స్వీకరణ** భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు మొత్తం 159 అర్జీలు స్వీకరించగా, వాటిలో...గ్రామ/వార్డు సచివాలయ సేవలు 7, అడంగల్ సవరణలు 58, చుక్కల భూముల క్రమబద్ధీకరణ & 22-ఎ భూములు 18, అసైన్డ్ భూములు, ఆక్రమణలు 19, రెవెన్యూ కోర్టు/ఆర్ఓఆర్ సమస్యలు 21, సర్వే, రీ-సర్వే 32, దేవాదాయ, వక్ఫ్ భూములు 4 దరఖాస్తులందాయని కలెక్టర్ తెలిపారు

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని వినతులు**

-- మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతిని కలెక్టర్ కు సమర్పించారు. -- బండిఆత్మకూరు మండలం చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన పక్కీరు హుస్సేన్, సర్వే నం. 573/దీలోని 10 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేసి పాసుబుక్కులు మంజూరు చేయాలని కోరారు. -- నంద్యాల మండలం ఇందిరానగర్‌కు చెందిన సిరిగిరి వెంకట రమణబాబు, తన భూమి (సర్వే నం. 1359/1, 1.66 ఎకరాలు)కు దారి అడ్డుకుంటున్నారని, దారి చూపించాలని విజ్ఞప్తి చేశారు. -- మహానంది మండలం బిల్లాలాపురం గ్రామానికి చెందిన దందిబోయిన శివ, రీ-సర్వే తర్వాత తన భూమి (సర్వే నం. 78, 1.25 సెంట్లు)పై ఇతరుల పేర్లు నమోదయ్యాయని, రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

# 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతులకు విస్తృత ప్రచారం

**ప్రతి ఒక్కరికీ యోగా క్లాసుల లింక్ షేర్ చేయాలని ఆదేశం**

**రోజుకు ఆరు సెషన్లతో యోగా కార్యక్రమం**

**పీజీఆర్ఎస్ వేదికల్లో ఆయుష్ మెడికల్ క్యాంపులు నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, మే 04(నంది పత్రిక):-** అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పురస్కరించుకుని 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతులకు విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ మరియు మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా సంయుక్తంగా నిర్వహిస్తున్న 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతుల గురించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మరియు సాధారణ ప్రజలకు ఈ తరగతుల లింక్‌ను విస్తృతంగా షేర్ చేసి, ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే మొదటి 14 రోజుల లైవ్ యోగా సెషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6, 7, 8 గంటలకు మరియు సాయంత్రం 4 నుంచి 7 గంటల మధ్య మూడు సెషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో సెషన్ 45 నిమిషాల పాటు కొనసాగుతుందని, ఈ కార్యక్రమాన్ని 'హాబిల్డ్ హెల్త్ టెక్' సంస్థతో కలిసి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మండల మరియు జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం (పీజీఆర్ఎస్) కార్యక్రమాల్లో ఆయుష్ విభాగం ద్వారా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ వంటి సంప్రదాయ వైద్య విధానాల ద్వారా ప్రజలకు చికిత్స అందించడంతో పాటు అవగాహన పెంచాలని సూచించారు. నంద్యాల పట్టణంలో ఈ వైద్య సేవలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కెమికల్ మందుల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను




తగ్గించేందుకు సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికంగా కనిపిస్తున్న మెడ, నడుము, మోకాళ్ల నొప్పుల నివారణలో ఆయుర్వేద తైలాలు ప్రయోజనకరమని వివరించారు. కర్పూర తైలం, మహానారాయణ తైలం, పిండ తైలం, సహచరాది తైలం వంటి ఔషధ తైలాల వినియోగంతో నొప్పుల నుండి ఉపశమనం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. వీటి వినియోగంతో పాటు యోగా సాధన చేయడం ద్వారా దీర్ఘకాలికంగా ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఈ తైలాలు ప్రభుత్వ సరఫరా ద్వారా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.పీజీఆర్ఎస్ వేదికల్లో ఆయుష్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆయుష్ మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...





**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 111 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 111 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) ఆర్ & బి విభాగంలో ప్రభుత్వ అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, తన కుమారుడి వద్ద నుండి రూ. 2 లక్షల 50 వేలు తీసుకుని మోసం చేసిన కర్నూలు , స్టాంటన్ పురం కు చెందిన సురపురాజువిజయ్ కుమార్ అనే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూల్ రూరల్ మండలం, నిడ్జూర్ గ్రామం కు చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు. 2) నన్ను డబ్బుల కోసం హాని ట్రాప్ కు గురి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఆటోనగర్ చెందిన విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. 3) తమకు చెందిన వ్యవసాయ భూమి ని ఇతరులు ఆక్రమించుకున్నారని, సంతకాలు ఫోర్జరీ చేసి చీటింగ్ చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఇంజనీర్స్ కాలనీకి చెందిన రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు. 4) 2026 ఏప్రిల్ 29న మా అమ్మ బ్రెయిన్ స్ట్రోక్ తో చనిపోయింది. మా నాన్న ఆచూకీ తెలియడం లేదు. మెడికల్ కళాశాలలో పనిచేస్తూ రిటైర్ అయ్యాడు. మా నాన్న బ్యాంకు ఖాతాలో రూ. 36 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్స్ ఉన్నాయి. ముగ్గురిపై అనుమానం ఉందని, మా నాన్న ఆచూకీ తెలపాలని కర్నూలు , ఆరోరా నగర్ కు చెందిన పత్తి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. 5) కర్నూలు ,వాణిజ్య నగర్ సొసైటీలో ఉన్న నా స్థలం ఆక్రమించుకొని కన్స్ట్రక్షన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు , జమ్మి చెట్టు వీధికి చెందిన శేషు యాదవ్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, రామయ్య నాయుడు, రామాశీజులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో బీజేపీ గెలుపు వెనుక ఇంత పెద్ద స్కెచ్ ఉందా?



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మమతా బెనర్జీ కంచుకోటగా భావించే అధికారాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 200కి పైగా స్థానాలతో ఈ అద్భుత విజయం వెనుక కేవలం సంప్రదాయ ర్యాలీలు, సభలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో బహుముఖ వ్యూహాలతో కూడిన పక్కా ప్రణాళిక ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల నుంచి సంస్థాగత నిర్మాణం వరకు ప్రతి అంశంలోనూ బీజేపీ ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు వారు విశ్లేషిస్తున్నారు.ఈ విజయంలో యువతను ఆకట్టుకోవడానికి చేపట్టిన "నరేంద్ర కప్" ఫుట్‌బాల్ టోర్నమెంట్లు కీలక పాత్ర పోషించాయని నిపుణులు చెబుతున్నారు. ఈ టోర్నీల్లో దాదాపు 1,200 పురుషుల జట్లు, 253 మహిళల జట్లు పాల్గొన్నాయి. దీని ద్వారా సుమారు 18,000 మంది క్రీడాకారులతో పాటు 18-25 ఏళ్ల మధ్య వయసున్న యువతకు బీజేపీ చేరువైంది. అదేవిధంగా, "వందేమాతరం" 150వ వార్షికోత్సవాన్ని ఒక పెద్ద సాంస్కృతిక ఉద్యమంగా మార్చారు. పాదయాత్రలు, సామూహిక గీతాలాపన, జెండాల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందిలో జాతీయ భావోద్వేగాలను నింపడంలో పార్టీ సఫలమైందని పరిశీలకులు పేర్కొంటున్నారు. సంస్థాగత బలం కూడా బీజేపీ గెలుపులో ప్రధాన భూమిక పోషించింది. "పరివర్తన్ యాత్ర" పేరిట 9 వేర్వేరు యాత్రలు నిర్వహించి, 217 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 లక్షల మందిని భాగస్వాములను చేసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతి మంచి ఫలితాలు

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు (ఇంచార్జి) కలెక్టర్ ప్రశంసలు**

**జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్**




**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్య సమస్యల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ కాల్వబుగ్గ చదువుతూ ఎం. హర్షవర్ధన్ 593 మార్కులు, పి. చంద్రబాబు 588 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. సాధారణ వనరులతోనే ఇంత ఉన్నత ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. ఈ విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను చేరుకోవడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, వారి అంకితభావం మరియు మార్గదర్శకత వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా పిల్లల విజయానికి బలమైన ఆధారమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి. సుధాకర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు...సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి ఇంచార్జ్ కలెక్టర్ వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ా+=ా సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇచ్చి, సంతృప్తి శాతం పెంచాలన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ,కొండయ్య, సునీత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు ఎరువు దుకాణాల లైసెన్స్ సస్పెండ్



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 4 :** బండి ఆత్మకూరు మండలంలోని మూడు ఎరువుల దుకాణాలకు సంబంధించిన లైసెన్సును సస్పెండ్ చేశామని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సోమవారం పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ఏప్రిల్ మాసంలో ఎరువుల అమ్మకాలు చేసిన బండి ఆత్మకూరులోని ఓంకారేశ్వర ఎరువుల దుకాణం, పార్నపల్లి గ్రామంలోని ప్రశాంతి ఫర్టిలైజర్స్, సంత జూటూరు గ్రామంలోని ఓంకారేశ్వర ఎరువుల లైసెన్సులను 15 రోజులపాటు సస్పెండ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పంటలు లేని సమయంలో రైతులకు యూరియా డిఏపి తో పాటు ఇతర ఎరువులు అమ్మకాలు చేయకూడదని పేర్కొన్నారు. ముందస్తుగా నిల్వ ఉంచుకోవడానికి రైతులకు ఎరువులు అమ్మిన, పంట లేని సమయంలో లావాదేవీలు జరిపినా, సంబంధిత డీలర్ల పై ఎరువుల నియంత్రణ చట్టం 1985 క్లాస్ 35 ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలో ఎరువుల దుకాణదారులను వ్యవసాయ అధికారి ఈ మేరకు హెచ్చరించారు. రానున్న ఖరీఫ్ సీజన్ కు పుష్కలంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని రైతులు ముందస్తుగా నిలువలను ఉంచుకోవద్దని వ్యవసాయ అధికారి సూచించారు. లైసెన్సులో సస్పెండ్ చేసిన దుకాణాలను ఏవో తనిఖీ చేసి నిలువ ఉన్న 7,91,000 స్టాకు అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ దుకాణాలలో నాలుగవ తేదీ నుండి 18వ తేదీ వరకు 15 రోజుల పాటు అన్ని రకాల ఎరువులకు సంబంధించిన అమ్మకాలను నిలుపుదల చేశామని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగేలా విరిగిన చెట్ల కొమ్మలను తొలగించండి.

**ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**

**తిరుపతి బ్యూరో చీఫ్ మే 3 నందిపత్రిక** గాలి, వానతో విరిగిన, ప్రమాధకరంగా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని బైరాగిపట్టేడ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు గాలి, వానకు విరిగిన చెట్ల కొమ్మల తొలగింపును అధికారులతో కలసి పరిశీలించారు. విరిగి పోయి వేలాడుతున్న వాటితో పాటు, ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. రుతు పవనాల ప్రభావం వలన వర్షాలు రానున్నాయని ఈ లోపు ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి తొలగించి, వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడక్కడా పడిపోయి ఉన్న డ్రైనేజి కాలువలను గుర్తించి మరమ్మతులు చేయాలని తెలిపారు. నగరంలో పారిశుదధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డి.ఈ.మహేష్, ఏసీపీ పార్వతి ప్రియ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఉన్నారు.



# దివ్యాంగుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



## జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్

## ఇంద్రధనస్సు పథకాలతో విభిన్న ప్రతిభావంతులకు నూతన అవకాశాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను ప్రజా ప్రతినిధులతో కలిసిజిల్లా కలెక్టర్ (ఇంచార్జి) పంపిణీ చేశారు.జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో మూడు చక్రాల మోటార్ సైకిల్ లను 70 మందికి మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి 10 మందికి చొప్పున పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన 54 మందికి కూడా త్వరితగతిన వాహనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందరికీ సమానంగా చేరేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, దివ్యాంగుల హక్కులను పరిరక్షించేందుకు 1993 మరియు 2016 చట్టాల ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సుభయాన్అభియాన్" కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అవసరమైన సౌకర్యాలు లేకపోతే తెలియజేస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంఘం నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమస్యలపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించేందుకు అంగీకరించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో మిషన్ మోడ్‌లో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కారుణ్య నియామకాల ద్వారా కూడా దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. అయితే నోటిఫికేషన్లకు ఎక్కువగా పట్టణ ప్రాంతాల నుంచే దరఖాస్తులు వస్తుండగా, గ్రామీణ ప్రాంతాల నుంచి తక్కువగా వస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తే వారు కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంద్రధనస్సు పథకాలతో విభిన్న ప్రతిభావంతులకు నూతన అవకాశాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.., విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరగడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కలిపి 70 వాహనాలు అందించడం ద్వారా లబ్ధిదారులకు ఉపాధి, స్వావలంబనకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఒక్కో వాహనం సుమారు లక్ష రూపాయల విలువ కలిగినదని చెప్పారు. దివ్యాంగత్వం శరీరానికే పరిమితం, మనసుకు కాదని, సరైన ప్రోత్సాహం ఉంటే వారు అన్ని రంగాల్లో రాణించగలరని ఆమె స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంద్రధనస్సు" కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, ఎక్స్ అఫీషియో సభ్యత్వం వంటి పలు ప్రయోజనాలను అందిస్తున్నదని వివరించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో పెన్షన్లు పెంచి పంపిణీ చేస్తున్నామని, గతంలో 200గా ఉన్న పెన్షన్‌ను 6000 వరకు పెంచిన ఘనత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అంతేకాకుండా, లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎక్కడ చదువుకుంటున్నారో అక్కడే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్య అందించాలని, విద్య ద్వారానే భవిష్యత్తు మార్పు సాధ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రజలకు పాణ్యం ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

**భారీ పెన్షన్లు, ఉచిత ప్రయాణం, రాజకీయ అవకాశాలతో సమగ్ర సంక్షేమం:చైర్మన్ నారాయణస్వామి** రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దివ్యాంగులకు సంబంధించిన బ్లాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. డిసెంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా "దివ్యాంగుల వారోత్సవాలు" ప్రకటించడం ద్వారా వారికి గౌరవం, గుర్తింపు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15,000 మంది దివ్యాంగులు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ఎక్కడ చదువుకుంటున్నారో అక్కడే వారికి పెన్షన్ అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక పెన్షన్లు అందిస్తున్నామని, దివ్యాంగులకు రూ.6,000, డయాలసిస్ పేషంట్లకు రూ.10,000, మంచానికే పరిమితమైన రోగులకు రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు అందిస్తూ వారి విద్య, ఉపాధికి ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించి, దానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏ సమస్య వచ్చినా విభిన్న ప్రతిభావంతుల చైర్మన్‌గా ఎప్పుడూ మీకు తోడుగా ఉంటానని, మీ కోసం పనిచేస్తానని నారాయణస్వామి భరోసా ఇచ్చారు.పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుపేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం, పెన్షన్ల పెంపు వంటి పథకాలను అమలు చేస్తోందని కుడా చైర్మన్ సోమశిట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. దివ్యాంగులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. పేదల సేవకే మంత్రి టీజీ భరత్ రాజకీయాల్లోకి వచ్చారని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు.విభిన్న ప్రతిభావంతుల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: గుడిసె కృష్ణమ్మ టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ... దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను గుర్తించిన చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో బస్సుల్లో ఉచిత ప్రయాణం, పెన్షన్ల పెంపు వంటి పథకాలతో పాటు జిల్లాలో 70 మూడు చక్రాల మోటార్ సైకిళ్లను పూర్తిగా ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో వాహనం లక్షల రూపాయల విలువ కలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. సమాజంలో దివ్యాంగులకు గౌరవం పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలు తమ అండదండలు, ఆశీర్వాదాలు కొనసాగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు మెగా కీ తో పాటు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయిస్ ఫాతిమా, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ కే. లక్ష్మీనారాయణ, కర్నూలు తెలుగుదేశం కమిటీ అధ్యక్షులు రవికుమార్, జనసేన రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల నాయకులు నాగరాజు, జిల్లా టిడిపి సాంస్కృతి విభాగపు అధ్యక్షులు పి. హనుమంతరావు చౌదరి , తెలుగుదేశం కార్యదర్శి నాగరాజు, విభిన్న ప్రతిభావంతుల నాయకులు సురేష్ నాయుడు, ఈరన్న ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 109 ఫిర్యాదులు...

### విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం......

### ఫిర్యాదులపై అలసత్వం వహించవద్దు.... అధికారులకు ఆదేశాలు....

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



**నంద్యాల క్రైం, మే04(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 109 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. నోట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు (మధ్యవర్తులు) చెప్పే మాయ మాటలకు ప్రలోభపడి డబ్బులు ఇచ్చి ప్రజలు ఎవ్వరూ మోసపోవద్దు. అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

**ఫిర్యాదులలో కొన్ని.....** 1.నంద్యాల టౌన్ ఇస్లాంపేటకు చెందిన వ్యక్తి మమ్మల్ని నమ్మించి నాకు మరియు నా కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని మా వద్ద నుండి పది లక్షల రూపాయలు మరియు బంగారము తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మమ్మల్ని బెదిరిస్తున్నాడని మాకు న్యాయం చేయండని గట్టాలనగర్ కు చెందిన బాధితురాలు జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేశారు. 2.మేము ములాన్ పేట నందు నివాసం ఉంటున్నాము. మేము మా బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చేసరికి మా ఇంట్లో ఉన్న నల్లపూసల దండ కనిపించడం లేదు విచారించి మాకు న్యాయం చేయగలరని నంద్యాల పట్టణానికి చెందిన ఇర్ఫాన జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేశారు. 3.నా భర్త ఆస్తి కోసం నన్ను శారీరకంగా ,మానసికంగా హింసిస్తున్నాడని, దీనికి మా అత్త మామలు కూడా మద్దతు ఇస్తున్నారని, నాకు న్యాయం చేయండని నంద్యాల పట్టణానికి చెందిన లక్ష్మీదేవి జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేశారు. 4.శ్రీశైలక్షేత్రం వాల్మీకి అన్నదాన సత్రంలో జరుగుతున్న అవినీతి, ద్రవ్య దుర్వినియోగం గురించి మరియు అభివృద్ధి నిరోధకము గురించి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిడ్డయ్య గారు జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేశారు.

# అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### పిజిఆర్‌యస్‌కు 16 ఫిర్యాదుల వెల్లువ




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పిజిఆర్‌యస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించి 16 ఫిర్యాదులు రాగా, వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఎంఈ మనోహర్ రెడ్డి, ఇంచార్జ్ మేనేజర్ జునైద్, ఆర్వో స్వర్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు తప్పనిసరి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమానాలు, ట్రేడ్ లైసెన్స్ రద్దు

### 100 శాతం చెత్త సేకరణలో అలసత్వం తగదు

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నగరంలో ఉన్న వాణిజ్య దుకాణాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమాన విధింపు, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. సోమవారం ఉదయం 2వ శానిటేషన్ డివిజన్‌లో మస్టర్ తనిఖీ నిర్వహించారు. కుమ్మరి గేరి, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, జమ్మిచెట్టు, జొహరపురం, గాంధీనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.పలు దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు లేకపోవడం, ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండటంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య



పర్యవేక్షక సిబ్బంది పరిశుభ్రతపై మరింత పట్టు సాధించాలని, ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి, 100 శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ట్రాలీలను వ్యాపారస్తులు సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అలాగే వినాయక ఘాట్ వద్ద కేసి కెనాల్‌ను కమిషనర్ పరిశీలించారు. గ్యాంగ్ వర్క్ పెట్టి, శుభ్రం చేయించాలని ఆదేశించారు.

**అన్న క్యాంటీన్ల నిర్వహకులపై అసంతృప్తి** కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడ అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి నాణ్యత ప్రమాణాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆహార నాణ్యత సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, భోజనాశాల నిర్వహకులతో ఫోన్‌లో మాట్లాడి రుచికరంగా, ప్రమాణాలకు అనుగుణంగా వంటలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఆర్. రాజు, నాగేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు

# మే నెలంతా విద్యార్థులకు స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపులు

### 8 నుంచి 16 ఏళ్ల విద్యార్థులకు ప్రత్యేక క్రీడా శిక్షణ

### జిల్లాలోని పలు కేంద్రాల్లో విభిన్న క్రీడల్లో కోచింగ్

### శిక్షణకు హాజరయ్యే వారికి డైట్, స్నాక్స్ సదుపాయం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, మే 4(నంది పత్రిక):-** జిల్లాలోని విద్యార్థులలో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు 2026 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 8 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని నంద్యాల స్పోర్ట్స్ కాంప్లెక్స్, రామకృష్ణ డిగ్రీ కళాశాల, టేక్కి మున్సిపల్ హైస్కూల్‌తో పాటు అన్ని మండల కేంద్రాల్లో వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాక్సింగ్, ఖో–ఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడలలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు కోచింగ్ నిర్వహిస్తారని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు చిక్కీ, స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందించబడతాయని, ప్రతి క్రీడాకారుడికి డైట్ ఛార్జీలుగా రోజుకు రూ.10 ఇవ్వబడుతుందని తెలిపారు. కోచింగ్ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి కేంద్రానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నిధులను క్రీడా సామగ్రి కొనుగోలు, కోచ్‌ల గౌరవ వేతనాలు మరియు ఇతర ఖర్చులకు వినియోగించాల్సిందిగా సూచించారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను సక్రమంగా సేకరించి ఆర్టీజిఎస్ కు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ మరియు హాస్టల్ వార్డెన్లతో సమన్వయం చేసుకుని ఎక్కువ మంది విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన శిక్షణ అందేలా కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమం చివరలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ పోస్టర్‌ను విడుదల చేశారు.

# పి జి ఆర్ ఎస్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి..



## జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి

**వై ఎస్ ఆర్ కడప,బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** అర్జీదారులకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించి.. ప్రజా సమస్యలను 0 % కి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి తోపాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని.. క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను.పరిష్కరించుకోవాలన్నారు.ప్రొద్దుటూరు టీచర్స్ కాలనీకి చెందిన టి. సుదర్శన్ రెడ్డి.. తనకు ఆరోగ్యం సరిగా లేదని, రెండు కిడ్నీలు డయాలసిస్ చేయించుకోవడానికి ప్రతి నెలా 15 వేలు ఖర్చవుతుందని, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంకు చెందిన బి. సుబ్రహ్మణ్యం.. ఇంటి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరుకు చెందిన తుమ్మల చెన్నయ్య గారి పెంచలమ్మ... తనకు 60 ఏళ్ళు పైబడి వయస్సు ఉందని ఆరోగ్య రీత్యా గుండె ఆపరేషన్ చేయించు కున్నానని, ఏ పనీ చేయలేను అని, ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.కడప కందిపాలెం కు చెందిన మున్నెమ్ పీరయ్య.. తన రేషన్ కార్డులో రమాదేవి పేరును తొలగించి.. తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శాంతమ్మ, రంగస్వామి, శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామ్యకం

**చిత్తూరు, అనంతపురంలో జరిగిన సంఘటనలు చాలా బాధాకరం..**

**జర్నలిస్టుల రక్షణ చట్టం పగడ్బందీగా అమలు చేయాలి..**

**మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజకుమార్..**



**నంద్యాల బ్యూరో, మే04(నంది పత్రిక)** జర్నలిస్టులపై దాడులు ఆ ప్రజాస్వామ్యానికి నిదర్శనం అని, రాష్ట్రంలో జర్న లిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రినక పగలనకా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా వి.కోట కేంద్రంలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని దారుణంగా వేటకొడవాళ్ళతో హత్యచేయడం బాధాకర విషయం అన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో మనం పత్రిక విలేకరి ని గీతం కళాశాల యాజమాన్యం కాళ్లు ముక్కించుకోవడం సిగ్గుచేటు అన్నారు. నిబద్ధతతో నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులను అభినందించాల్సింది మరిచి హత్యలు చేయడం, మానసికంగా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. జర్నలిస్టులు తప్పుడు వార్తలు పత్రికల్లో రాశారని అనుమానం వచ్చినప్పుడు కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తులో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక.



**రుద్రవరం ప్రతినిధి మే 04 (నంది పత్రిక)** ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాసిల్దార్ కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని శాఖల అధికారులతో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వారిసమస్యలపై ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేస్తే ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**- తహసిల్దార్ ఉమారాణి**



**కొత్తపల్లి – నంది పత్రిక:** రైతులకు చెందిన భూమి యొక్క పూర్తి వివరాలతో పట్టాదారు. పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో రీసర్వే' చేసిన భూములకు పట్టాదారు. పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ రీ సర్వే ద్వారా రైతులకు చెందిన భూములకు పక్కాగా కొలతలు వేయడం జరిగిందన్నారు. రీ సర్వే చేసిన భూములన్నిటికి రైతులు, భూముల పూర్తి వివరాలను పొందుపర్చి పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామంలో 979 మంది రైతుఉన్నారన్నారు. అందులో సుమారు 700 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. వీటిలో తప్పులు ఏమైనా ఉంటే రైతులు మరళ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని సరిచేసి మరళ రైతులకు పక్కావివరాలతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఆర్కి బాబుమియా, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, వీఆర్వో రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో లాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ విజయవంతం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ఆదోని ప్రాంతంలోని నాగల దిన్నె గ్రామానికి చెందిన 20 సంవత్సరాల యువతి శ్రవంతి, గత 20 రోజులుగా ఎడమ పై పొత్తికడుపు భాగంలో నొప్పితో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి శస్త్రచికిత్స విభాగాన్ని ఆశ్రయించింది. వైద్యుల పరిశీలనలో అల్ట్రాసౌండ్ పరీక్షలో ప్లీహ పై భాగంలో సుమారు 13x14x13 సెం.మీ పరిమాణంలో పెద్ద సిస్టు గుర్తించబడింది. అనంతరం సీ.ఈ.సీ.టి పరీక్ష ద్వారా నిర్ధారించబడింది.వైద్య బృందం ఆమెకు లాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ (ప్లీహ తొలగింపు శస్త్రచికిత్స) చేయాలని నిర్ణయించి, 30-04-2026న విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ లాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ విజయవంతంగా పూర్తయిందని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం స్థిరంగా ఉండి, ఎలాంటి శస్త్రానంతర సమస్యలు లేకుండా కోలుకుంది. ఈ శస్త్రచికిత్సను యూనిట్-2 చీఫ్ డాక్టర్ ఆర్. రామకృష్ణ నాయక్ , అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రశాంతి కలిసి విజయవంతంగా నిర్వహించారు. అనస్థీషియా విభాగం హెచ్ఓడీ & ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, ప్రొఫెసర్ డాక్టర్ రామశివ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ కుమార్ కూడా ఈ చికిత్సలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , మరియు శస్త్రచికిత్స విభాగం అధిపతి డాక్టర్ పి. హరిచరణ్ శస్త్రచికిత్స బృందాన్ని అభినందించారు.వైద్యులు మరియు పీజీ విద్యార్థుల సమిష్టి కృషితో ఈ యువతికి విజయవంతమైన శస్త్రచికిత్స చేయడం సాధ్యమైందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## మూడు రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వం గెలవడం సంతోషం

### బీజేపీ కోడుమూరు ఇంచార్జ్ వేల్పుల గోపాల్



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీలోని వివిధ మండలాలలో బిజెపి శ్రేణుల సంబరాలు చేసుకోవడం జరిగింది ఈ సందర్భంగా వేల్పుల గోపాల్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ, రెండు రాష్ట్రాలు మినహా మూడు రాష్ట్రాలలో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న ఏకైక పార్టీ జాతీయ పార్టీ బిజెపి పార్టీ ముఖ్యంగా బెంగాల్ రాష్ట్రంలో తుగ్లక్ లాంటి అరాచక బంగ్లాదేశీయులు రోహింగ్యాలు మమతా ప్రభుత్వంను కూల్చి ఈ విజయం భారత ప్రజలు భారతదేశ భద్రతకు మరింత భరోసాను బిజెపి పార్టీకి పట్టం కట్టారు, ఈ విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్నా భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు శుభా అభినందనలు తెలియ చేస్తున్నామని అన్నారు.

## పాచి పట్టిపోయిన నీటి తొట్లు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 4:** మీరేమో మినరల్ వాటర్, ఫిల్టర్ నీళ్లు తాగుతారు. మేము మాత్రం పాచి పట్టి పోయిన నీళ్లు తాగాలా! అంటూ మూగ జీవాలు అధికారులను ప్రశ్నిస్తున్నాయి. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకుగాను నీటి వసతి ఉన్నచోట, నీటి తొట్లను నిర్మించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద బండి ఆత్మకూరు మండలంలో దాదాపు 30 నీటి తొట్లను నిర్మించారు. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో ఈ తొట్లను నిర్మించి, నీటితో నింపి మూగజీవాలకు దాహార్తిని తీర్చాలని ఉద్దేశంతో తొట్ల నిర్మాణం జరిగింది. తొట్లనైతే నిర్మించారు కానీ, వాటి నిర్వహణలో మాత్రం అధికారులు గాలికి వదిలేశారు. కొన్ని గ్రామాలలో నీటి తొట్లను శుభ్రం చేయకపోవడం వల్ల, అవి పాచి పట్టిపోయి, మూగ జీవాలు తాగేందుకు కూడా పనికిరాకుండా ఉన్నాయి. నీటి తొట్లను ప్రతి రోజు శుభ్రం చేసి వాటి నిర్వహణ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఆదేశాలు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా ధిక్కరించే విధంగా కొందరు అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విచారకరం.

## దొడ్డిపాడు గ్రామ రైతులు భూ సంబంధిత, సాగునీటి, పంట నష్టపరిహారం వంటి పలు సమస్యలు పరిష్కరించండి

**పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** కర్నూలు జిల్లా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి జాయింట్ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.కల్లూరు మండలం ; పెద్దటేకూరు పంచాయితీ దొడ్డిపాడు గ్రామానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు...దొడ్డిపాడు గ్రామ రైతులు భూ సంబంధిత, సాగునీటి, పంట నష్టపరిహారం వంటి పలు సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.. ఈ సమస్యల పరిష్కారం కోసం రైతులు పలుమార్లు అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడం బాధాకరమని, రైతుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాటసాని రాంభూపాల్ మండిపడ్డారు..రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న విధానానికి విరుద్ధంగా పాణ్యం నియోజకవర్గ పరిధిలో కొందరు వ్యక్తులు ఇసుక రవాణాను అడ్డుకుని, డంపుల్లో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని, ఇలాంటి అక్రమాలు సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని కాటసాని స్పష్టం చేశారు.ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకుని కర్నూలు జిల్లాల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా ప్రజలకు ఉచిత ఇసుక అందేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు..ఈ కార్యక్రమంలో పెద్దటేకూరు గ్రామ నాయకులు హనుమంత రెడ్డి దొడ్డిపాడు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## నగరపాలక సంస్థకు 36 వినతులు.

**ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా ఎస్. టి. వి. నగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయాలని, యూడీఎస్, రోడ్లు మరమ్మతులు చేయాలని, రవీంద్ర నగర్ నందు ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, ఎల్. ఆర్. ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని, పి ఎస్ 4 హోటల్ వెనుక జరుగుతున్న అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, నెహ్రూ నగర్ లోని మా ఇంటి ముందు చెత్త వేయడం వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, ఉపాధ్యాయ నగర్ వద్ద గాలి వానకు పడిపోయిన చెట్లు తొలగించాలని, నరసింహ తీర్థం రోడ్డులోని కర్మక్రియల భవనం మరమ్మతులు చేయించాలని, ఎమ్మార్ పల్లి తేజస్వి స్కూల్ వద్ద కాలువలు శుభ్రం చేయాలని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## అయోడిన్ లోప వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** ఇందిరమ్మ హౌసెస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో అయోడిన్ లోప వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమంలొ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్. మహేశ్వరా ప్రసాద్ మాట్లాడుతూ అయోడిన్ (ఉప్పు) లోపం వల్ల వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని తెలిపారు., అయోడిన్ లోపం వలన చిన్నారుల్లో ఎదుగుదల లోపం,బుద్ధి మాంధ్యం, పెద్ద వయస్సు వారిలో థైరాయిడ్ సమస్యలు వస్తున్నాయని, అయోడిన్ లోపం వల్ల ప్రబలే ఆరోగ్య సమస్యలపై గర్భిణీలకు, ప్రజలకు అవగాహన కల్పించినారు, మనుషుల శారీరక పెరుగుదలకు మరియు అభివృద్ధికి ,మానసిక వృద్ధికి , గర్భస్థ పిండం,చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు , పిల్లల్లో తెలివి తేటలకు అయోడిన్ ఏశీతో ముఖ్యం అని తెలిపారు. గర్భవతులు తీసుకొనే ఆహారంలో అయోడిన్ లేకపోతే ,మంద బుద్ధి కలిగిన లేదా వినికిడి లోపం,మూగతనం వంటి సమస్యలు ఉన్న పిల్లలు పుట్టవచ్చును,,కొన్ని సార్లు గర్భస్రావం కూడా అవుతుంది, ముఖ్యంగా గర్భవతులు,చిన్న పిల్లలు తప్పకుండ అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమములో ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, స్టాఫ్ నర్సులు నిర్మల, రాజాప్రసన్న కుమార్, వైద్య సిబ్బంది మరియు ప్రొజెక్షనిస్ట్ వా.ఖలీల్ పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.

**తిరుపతి బ్యూరో చీఫ్ మే 4 నంది పత్రిక** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, అధికారులతో కలసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. చేస్తున్న, చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆయా విభాగాల అధికారులు విధులు కేటాయించామని అందరూ వారి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని జాతర విజయవంతం చేయాలని తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్ వెంట డి.ఎస్.పి భక్తవత్సలం, ఈవో జయకుమార్ , మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , డి.ఈ లు రాజు, శిల్పా, ఏసిపి పార్వతిప్రియ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు



# కమర్షియల్ గ్యాస్ పై పెంచిన ధరలుఉపసంహరించుకోవాలిసిపిఐ ధర్నా

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం పెరిగిన కమర్షియల్ గ్యాస్ ధరనుఉపసంహరించుకోవాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి .మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి శ్రావణి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలను మోసం చేయడంలో భారతీయ జనతా పార్టీకి మించిన పార్టీ మరొకటి లేదని ఎన్నికల ముందర ఒక మాట ఎన్నికల తర్వాత మరొక మాట మాట్లాడడం అది బిజెపి ప్రభుత్వానికి చెందినది నరేంద్ర మోడీ అమిత్ షా ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లో గ్యాస్ పెట్రోలు డీజీలు రేట్లు పెంచబోమని అది ప్రభుత్వ భరిస్తుందని ప్రజలను నమ్మబలికి ఓట్లు వేయించుకున్న మరుసటి రోజున కమర్షియల్ గ్యాస్ సిలిండర్ లపై 960 రూపాయలు పెంచడం చాలా దారుణమని కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం ద్వారా ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని పైన పట్టణాలకు వెళ్లినప్పుడు హోటళ్లకు వెళ్లి టిఫిన్ చేయాలన్న భోజనం చేయాలన్న వాటిపైన హోటల్ యజమానులు పెంచిన రేట్లను తినే పదార్థాల పైన పడుతుందని తద్వారా పేద ప్రజలు మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతారని ఇప్పటికే రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యవసర వస్తువుల ధరలు కొనలేక ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మరీ గ్యాస్ రేట్లు పెంచడం ద్వారా ప్రజలు ఆర్థికంగా చితికి పోయే పరిస్థితి ఉన్నదని వారు అన్నారు తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను




ఉపసంహరించుకోవాలని పెట్రోలు డీజిల్ పైన ధరలు పెంచాలనే ఆలోచన విరమించుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి దంభోలం శ్రీనివాసరావు నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు బిసన్న అన్వర్ నల్లన్న సురేష్ రాముడు ప్రసాదు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ తహసిల్దార్ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో ఇంచార్జి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు శనివారం నాటికి పూర్తి చేయాలని గత సమావేశంలో చెప్పినప్పటికీ అనుకున్న స్థాయిలో పురోగతి లేదన్నారు. ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు.పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ నిదానంగా జరుగుతుందని, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. ఫేస్ 3 రీ సర్వే కి సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు.. మ్యుటేషన్ కి సంబంధించి బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఎట్ టూ వ్యూ లో కూడా ఏవి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, ఏడి సర్వే మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నంది పత్రిక
మంగళవారం 05 - 05 -2026

## శక్తియాప్ అవేర్నెస్ ప్రోగ్రాం: శక్తి టీం.,




**ఆత్మకూరు మండలం నంది పత్రిక.....** ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది అయిన మేము నంద్యాల జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజీ నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆఫీసు లో మెప్మా సూపర్వైజర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నేను మరియు 10 వ సచివాలయ +మీఖ సువర్ణ మేడం తో పొదుపు సంఘాల లీడర్లతో మరియు సభ్యులతో ఈరోజు శక్తీ యాప్ అవేర్నెస్ ప్రోగ్రాము చేస్తూ అక్కడ ఉన్న వారికి శక్తి యాప్ యొక్క ఉపయోగాల గురించి తెలిపి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 ను తెలిపి మీకు అత్యవసరంగా పోలీస్ సహాయం అవసరమైనప్పుడు ఈ యాప్ ద్వారా సమాచారం ఇవ్వడం ఎలాగో తెలుపుతూ , ఈ యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ దాని ప్రాముఖ్యత గూర్చి కూడా తెలియజేయడం అయినది. ఎవరైనా 18 సంవత్సరాల లోపు పిల్లలకు పెళ్లిళ్లు చేస్తుంటే డయల్ 1098 కి గాని లేక 112 గానీ ఫోన్ చేసి చెప్పాలని మరియు మీ సెల్ ఫోన్ కు వచ్చిన అనవసర ఫోన్ కాల్స్ లను, లింకులను ఓపెన్ చేయవద్దని అటువంటి వాటిని మీ తప్పిదం వల్ల ఓపెన్ చేస్తే మీ యొక్క బ్యాంక్ అకౌంట్ హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు అందులోని డబ్బును దోచేస్తున్నారని తెలిపి అటువంటి వాటికి ఎవరైనా మోసపోయినట్లయితే డయల్ 1930 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని తెలిపినాము. ఏదన్నా అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎమర్జెన్సీ కాల్ నంబర్స్ అయిన 112,100 గురించి కూడా తెలియజేస్తూ అవేర్నెస్ కల్పిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగింది జరిగింది.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహించిన విద్యార్థిని స్వాతిని అభినందించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.

**వెలుగోడు, మే 4 (నంది పత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 21 మంది విద్యార్థుల ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ను విజయవంతంగా అధిరోహించారు. ఈ యాత్ర ఏప్రిల్ 16 నుండి 30 వరకు జరిగింది.వెలుగోడు గ్రామానికి చెందిన బండి స్వాతి, ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని, దివ్యాంగుల ఎంపికై ఈ సాహసయాత్రలో పాల్గొని విజయవంతంగా ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించింది. ఈ సందర్భంగా ఆమె శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్వాతి ధైర్యసాహసాలను అభినందిస్తూ నగదు పురస్కారం అందించారు. పట్టుదల, కృషి, ధైర్యం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ తన పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు.విద్యార్థిని స్వాతి మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని కల్పించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , జిల్లా ఎస్పీ, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి పి. జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నిత్యానంద రాజు, విలీన విద్య సమన్వయకర్త జగన్మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్, ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ నళిని, భవిత పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వర రావు, కుద్రతుల్లా, నాగన్న, భాస్కర్, విద్యార్థిని తండ్రి బండి రాము పాల్గొన్నారు.



# మద్దిలేరు వంతెనకు మోక్షం ఎప్పుడో!



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 4:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న అయ్యవారి కోడూరు గ్రామం నుండి భీమవరం కు వెళ్లే దారి మధ్యలో ఉన్న మద్దిలేరు వాగు వంతెనకు మోక్షం ఎప్పుడోనని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొందరు ఫిర్యాదు చేశారు. మద్దిలేటి వాగు వంతెన ఏడు సంవత్సరాల కాలం నుండి శిథిలం కావడంతో రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఖరీఫ్, రబీ సీజన్లో ధాన్యం తోలుకోవాలంటే నరకయాతన పడుతున్నామని రైతుల పేర్కొంటున్నారు. వర్షాల కారణంగా వంతెన పూర్తిగా దెబ్బ తినడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని గతంలో పి జి ఆర్ఎస్ కార్యక్రమం జరిగినప్పుడు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శిథిలమైన మద్దిలేరు వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు. పిజిఆర్ఎస్లో రైతులు ఈ విషయంపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఈ విషయాన్ని ప్రకటించకపోవడం కొసమెరుపు.

## మొక్కజొన్న రైతును ప్రభుత్వం ఆదుకోవాలి మద్దతు ధర క్వింటా రూ. 2400తో కొనుగోలు చేయాలి..

### తహసీల్దార్ కు రైతు సంఘం, సిపిఐ వినతిపత్రం



**బనగానపల్లె మే 4నందిపత్రిక** రబిలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను క్వింటా రూ. 2400మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని సోమవారం రైతుసంఘం నాయకులు, సీపీఐ నాయకులు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మీడియా తో మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. క్వింటా మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం రూవ 2400లకు కొనుగోలు చేయాలని,జిల్లాలో రబీ సీజన్లో సుమారు15వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మార్చి చివరి నుండే మొక్కజొన్న పంట మార్కెట్ కు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం క్వింటా మొక్కజొన్నకు రూ.2,400లు మద్దతు ధర ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే విషయంలో ముందుకు రాకపోవడంతో వ్యాపారస్తులు సిండికేట్గా మారి క్వింటా మొక్కజొన్నను రూ1,700లోపు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల క్వింటాకు రూ700 చొప్పున ఎకరానికి రూ 21 వేల నష్టం వస్తున్నది. మొక్కజొన్న పండించిన రైతాంగంలో చిన్న, సన్నకారు, కౌలురైతులే గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి కోత, నూర్పిడి, ట్రాక్టర్ల అద్దెలు విపరీతంగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో కౌలురెట్లు కూడా పెరిగాయి. మార్కెట్లో లభిస్తున్న ధర చూస్తే కనీసం సాగు ఖర్చులు కూడా దక్కని పరిస్థితి ఉంది.ఇటీవల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ మొక్కకొన్న రైతులు మార్కెట్లో అమ్ముకున్న ధరకు, మద్దతు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెల్లించటానికి కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు అటు కేంద్ర ప్రభుత్వం గానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ మొక్కజొన్న కొనుగోలు చేయటానికి ఎటువంటి నిర్ణయం జరగలేదు. వ్యత్యాసం ధర చెల్లించడానికి కూడా ఎటువంటి చర్యలు చేపట్లేదు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే ఈ క్రింద చర్యలు చేపట్టి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి సీపిఐ సీనియర్ నాయకులు సంజీవులు సిపిఐ మండల కార్యదర్శి శివయ్య చేతి వృత్తుల సంఘం నాయకులు శివ నాగయ్య రైతు సంఘం నాయకులు రవి స్వామి ఏఐఎస్ఎఫ్ నాయకులు మతేష్ తదితరులు పాల్గొన్నారు

# భాజపా ‘విజయ‘దుందుభి: కర్నూలులో కమల శ్రేణుల కదం తొక్కు!

### ఐదు రాష్ట్రాల ఫలితాలతో పులకించిన కల్లూరు.. బాణసంచా మోత, మిఠాయిల పంపిణీ!



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** దేశ రాజకీయ యవనికపై భారతీయ జనతా పార్టీ మరోసారి తన తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భాజపా ప్రభంజనం సృష్టించడంతో కర్నూలు జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం సాయంత్రం కల్లూరు మండలం ప్రధాన కూడలి వద్ద భాజపా శ్రేణులు నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. బాణసంచా పేలుళ్లు, మోదీ నినాదాలతో కల్లూరు వీధులు మార్మోగాయి. బెంగాల్ కోటపై కాషాయ జెండా.. దక్షిణాది టార్గెట్‌గా నెక్స్ట్ ఆపరేషన్! ఈ విజయోత్సవ సభలో పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో 205 స్థానాల భారీ మెజారిటీతో మమతా కోటను బద్దలు కొట్టి, అధికారాన్ని కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. అస్సాంలో హ్యాట్రిక్ విజయం, పుదుచ్చేరిలో వరుసగా రెండోసారి అధికారం చేపట్టడం ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారనడానికి నిదర్శనమన్నారు. “ఇది ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ భాజపా జైత్రయాత్ర కొనసాగుతుంది.. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు“ అని ధీమా వ్యక్తం చేశారు.ఉత్సాహంగా పాల్గొన్న నేతలు:ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ముఖ్య నాయకుల జాబితా:రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఎస్. నాగరాజు యాదవ్, కన్వీనర్ ముద్దిగట్టి రెడ్డిపాల్, జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి యాదవ్, మాజీ ఉపాధ్యక్షులు తాశంత్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమణి యాదవ్, కిసాన్ మోర్చా నేత ప్రవీణ్ ఆచారి పాల్గొన్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు రవి శేఖర్, మోహన్ రావు, ఓబీసీ మండల అధ్యక్షులు వన్నె యాదవ్, శేఖర్ చారి, ఓబీసీ నేతలు భాస్కర్, విశ్వం, ఓబీసీ మోర్చా నాయకులు డి. చంద్రశేఖర్, తిరుపతి, రవికుమార్, మధుసూదన్ రావు హాజరయ్యారు. కల్లూరు మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర ఆచారి, నాగభూషణం, పి. వెంకటేశ్వర రెడ్డి తదితర నాయకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొని విజయ సంబరాల్లో పాలుపంచుకున్నారు.

## మోడీ పాలన పై నమ్మకం..!

### -మూడు రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం.
### - కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి.



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 4.:** దేశంలో జరిగిన ఐదు రాష్ట్రల ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతాపార్టీ మూడు రాష్ట్రలలో ఘన విజయం సాధించడం నరేంద్ర మోదీ పాలన మీద ప్రజలకు ఉన్న నమ్మకమే నేటి ఎన్నికల ఫలితాలు బిజెపి ఘన విజయానికి నిదర్శనం అని బిజెపి కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిజ్జం సుబ్బారెడ్డి మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ పాలనలో అత్యాచారానికి గురైన సాధారణ కుటుంబానికి చెందిన యువతి అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనకు చలించిన నరేంద్ర మోడీ ప్రాణాలు కోల్పోయిన యువతి తల్లికి అసెంబ్లీ బిజెపి సీటు కేటాయించి ఒక నిరుపేద కుటుంబానికి చెందిన మహిళను ఎమ్మెల్యే గా గెలిపించిన ఘనత నరేంద్ర మోడీ దని అన్నారు. భారతదేశ చరిత్రలో 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి తో మొదలైన బిజెపి హవా నేటి నరేంద్ర మోడీ పరిపాలన వరకు అంచలంచెలుగా బిజెపి ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందని అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ అధికారం అడ్డుపెట్టుకొని నియంత పాలన కొనసాగించడంతో పాటు ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చెయ్యడంతో, బెంగాల్ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలంటే, నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి పార్టీ అధికారంలోకి రావడమే సరైన నిర్ణయం అని భావించి అధికారం కట్టబెట్టారని బిజ్జం అన్నారు. ఈ సందర్భంగా ఘన విజయం అందించిన మూడు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో భారతదేశంలో బిజెపి శాశ్వత పార్టీగా పరిపాలన కొనసాగించడం ఖాయమని అన్నారు. రాష్ట్రల అభివృద్ధి జరగాలన్న, ఉద్యోగ ఉపాధి, పరిశ్రమలు, ఆర్థికాభివృద్ధి, దేశం పురోగతి చెందాలన్న కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి పరిపాలన కొనసాగించాల్సిన అవసరాన్ని మూడు రాష్ట్రల ప్రజలు గమనించారని, అందుకే బిజెపి ఘన విజయానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. భవిష్యత్తులో బిజెపి మరింత బలపడే దిశగా పయనిస్తుందని, గత రెండు నెలల క్రితం ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ దేశాలలో నెలకొన్న యుద్ధ వాతావరణం పరిస్థితులలో ఇతర దేశాలు ఆర్థిక అసమానతలకు, పెట్రోల్, డీజల్, గ్యాస్ వంటి నిత్యావసర ఇంధనముల కొరతతో విలవిలాడినప్పటికీ, మనదేశానికి ఎలాంటి ఇంధన కొరత లేకుండా సరఫరా చేయించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కింది అని అన్నారు. ప్రపంచంలో భారతదేశ శక్తిని నలుమూలలకు చాటిన ఘనత కూడా నరేంద్ర మోడీదే అని అన్నారు. గ్రామీణ స్థాయి నుండి పట్టణ నగర స్థాయి వరకు నేటి అత్యాధునిక సాంకేతిక రంగాలలో పేద వర్గాల మహిళలనుండి ధనిక వర్గాల వరకు సమాంతర అభివృద్ధి జరుగుతుందంటే అది నరేంద్ర మోడీ ఆలోచన విధానంతోనే సాధ్యమని అన్నారు. భవిష్యత్తులో దేశ పురోగతి బిజెపికే సాధ్యమని బిజ్జం సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

## గూటుపల్లె గ్రామానికి విలేజ్ సర్వేయర్ ను నియమించాలి.

### -సర్వేయర్ లేక భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు.



**బేతంచెర్ల మే 4 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలంలోని గూటుపల్లె గ్రామానికి రెగ్యులర్ సర్వేయర్ ను నియమించాలని గూటుపల్లె పంచాయితీ గ్రామస్తులు రైతులు కోరుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం గూటుపల్లె గ్రామానికి సర్వేయర్ గా పనిచేస్తున్న కేశవ్ ప్రమాదంలో మరణించారు. అయితే అప్పటినుండి అతని స్థానంలో ఇన్చార్జి విలేజ్ సర్వేర్లను సంబంధిత అధికారులు నియమిస్తూ పనులు చేస్తున్నారు. దీంతో రెగ్యులర్ సర్వే లేక ఆయా గ్రామాలలోని రైతులు ప్రజలు భూ సమస్యల పరిష్కారం విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలలోని విస్తీర్ణం సర్వే నంబర్లు తదితర సమస్యలను పరిష్కరించాలని మండల తహసీల్దార్ కు విన్నవించుకున్నప్పటికీ,సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల సర్వే ను సమాధానం అడగగా, మీకు రెగ్యులర్ సర్వే వస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ అధికారి సమాధానం ఇస్తున్నారు. మండల సాధ్యమైనంత త్వరలో స్పందించి గూటుపల్లె గ్రామానికి రెగ్యులర్ సర్వేయర్ను నియమించే విధంగా, సహాయ సహకారాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## నూతన పట్టాదార్ పాస్ బుక్ లు పంపిణీ చేసిన మంత్రి

**అవుకు మే 4నందిపత్రిక** అవుకు మండలం మెట్టుపల్లి గ్రామంలో సోమవారం మంత్రి బీసి జనార్దన్ రెడ్డి రైతన్నలకు నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పట్టాదారు పాసుపుస్తకాలు తప్పులు తడకగా మార్చి రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు.చంద్రబాబు నాయకత్వంలో రాజముద్ర తో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీతో రైతన్నల హక్కులను సంరక్షిస్తున్నాం అన్నదాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి రైతన్నల హక్కులను పరిరక్షించాం.భూమే ప్రాణంగా బతికే రైతులకు భూసమస్యలు లేకుండా చేయడం మా కూటమి ప్రభుత్వ లక్ష్యం గత ప్రభుత్వం రీ సర్వే పేరిట రైతుల భూముల్లో అనేక అక్రమాలకు పాల్పడింది. నాటి రీసర్వే తప్పులను సరిదిద్ది, నేడు పట్టాదారు పాస్ బుక్ లపై రాజముద్ర వేసి రైతుల హక్కులను కాపాడం నేడు ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాల్లో ఏవైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారు అని తెలిపారు. మెట్టుపల్లెలో మొత్తంగా 816 పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాల్సి ఉండగా.. 728 మందికి పంపిణీ చేస్తున్నాము.. మిగిలిన వారికి త్వరలో ఇస్తాం అని మంత్రి చెప్పారు.



## కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

### సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష



**కర్నూలు ప్రతినిధి నంది పత్రిక** సోమవారం జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో కేరళ కాంగ్రెస్ నేతృత్వంలోని యు డి ఎఫ్ విజయంపై కర్నూలు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ సూచన మేరకు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తుది లెక్కింపులో కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ (యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) విజయం సాధించిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష తెలియ చేశారు, కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, భవిష్యత్ ఎన్నికల్లో ప్రజలకు మరింత చేరువ కావడానికి మా యువ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే బిజెపి పతనం ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి మీసాల సుమలత. ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ 48 వార్డు ఇన్చార్జి షేక్ షబ్బీర్ మొదలుగు వారు పాల్గొన్నారు.

## భాజపా విజయఢంకా: ఎంపీటీసీ భగవాన్



**నంద్యాల ప్రతినిధి. మే 04 . (నంది పత్రిక ):** ఐదు రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రలలో అఖండ విజయం సాదిగించింది అని ఎంపీటీసీ భగవాన్ యాదవ్ ఆనందాన్ని వ్యక్త పరిచారు. మరి ముక్యంగా బెంగాల్ గెలుపు ఒక చారిత్రాత్మక విజయం.ప్రజా క్షేత్రం లో గెలిచిన బీజేపీ అభ్యర్థులకు ఓటువేసిన ఓటరు మహాశాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి దోహదపడతాయి.





## పిల్లల అడుగులు గ్రంథాలయం వైపు మళ్లెలా పెద్దలు ప్రోత్సహించాలి వేసవి విజ్ఞాన శిబిరాలలో ప్రతి విద్యార్థి శిక్షణ పొంది విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**బీమవరం బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** భీమవరం వీరమ్మ పార్క్ వద్ద ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవిజ్ఞాన శిబిరాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు శిక్ష తీరును పరిశీలించారు. లైబ్రరీ పుస్తకాల నిర్వహణ, విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సుల వివరాలు, క్రీడలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొద్దిసేపు విద్యార్థులతో సంబంధిత సబ్జెక్టులపై ముచ్చటించి వారి విజ్ఞానాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో కంప్యూటర్ బేసిక్స్, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, యోగ, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలను బోధించడం జరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి వేసవి సెలవులలో తప్పక తమకు దగ్గరలో ఉన్న గ్రంథాలయాలలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరాలకు వెళ్లి శిక్షణ పొందవలసినదిగా సూచించారు. ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు ఈ శిక్షణ శిబిరాలు 40 రోజులు పాటు ఉదయం 8 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు కొనసాగుతాయన్నారు. శిక్షణ శిబిరంలో ప్రతిరోజు సుమారు 70 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ బి.ఉమశ్రీ, జి.రమేష్ నాయుడు కంప్యూటర్ విభాగాల పనితీరును విద్యార్థులకు వివరించారు. డి.శ్యామ్ ఉపాధ్యాయులు పిల్లలకు డాన్స్ లో శిక్షణ ఇవ్వటం జరుగుచున్నది. వీరితోపాటు రిటైర్డ్ తెలుగు ప్రధానోపాధ్యా యులు కలిగొట్ల గోపాలశర్మ నీతి కథలు ద్వారా విద్యార్థులో క్రమశిక్షణ,స్నేహభావం, పెద్దలపట్ల గౌరవం,సామాజిక స్పృహ వంటి విలువలను నేర్పిస్తున్నారు.ఇటువంటి కార్యాచరణ ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలలో ప్రతి ఒక్క విద్యార్థి పాల్గొని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో 31 గ్రంథాలయ సంస్థలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పించడం జరుగుతున్నదని, విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. వివిధ పోటీ పరీక్షలకు ప్రేపర్ అయ్యే అభ్యర్థులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విజ్ఞాన శిబిరాలలో విద్యార్థులు భోజనం చేయుటకు బెంచీలు, డ్రింకింగ్ వాటర్ వంటి కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసినదిగా మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఇటువంటి శిబిరాలలో శిక్షణ పొందితే విద్యార్థులు మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు వారి ప్రతిభను కనపరచుకోవచ్చని అన్నారు. వివిధ అంశాలకు సంబంధించి అన్ని పుస్తకాలు లైబ్రరీలో ఒకే చోట లభించటం జరుగుచున్నదని అన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు లైబ్రరీలో తీసుకొని చదువుకుంటే మంచి విజ్ఞానం లభిస్తుందని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా చిన్నారులకు నోటు పుస్తకాలు పంపిణీ గావించారు. అనంతరం "వేసవి విజ్ఞాన శిబిరాలు - 2026" పోస్టరును ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా శాఖా గ్రంథాలయాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాలకు ప్రతి ఒక్కరు వచ్చి వేసవి సెలవులలు వృధా కాకుండా విద్యార్థులలో వృత్తి నైపుణ్యం, చదువు పట్ల ఆసక్తి కలిగించే అంశాలను అభ్యసించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకొని శిబిరాలకు తీసుకురావలసినదిగా కోరారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, భీమవరం మండల రెవెన్యూ అధికారి రావి రాంబాబు, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శేఖర్ బాబు, లైబ్రరియన్ ఎస్.వెంకటేశ్వరరావు, రిటైర్డ్ హెచ్ఎం కలిగొట్ల గోపాల శర్మ, మానవతా చైర్మన్ బి.వెంకటపతి రాజు, మానవతా సభ్యులు వద్దే వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు పట్టణంలో నేడే ఉచిత ఒడుగుల (ఖత్నా ) కార్యక్రమం.



**నందికొట్కూరు మే 4( నంది పత్రిక)** ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మంచి అనుభవజ్ఞులైన వైద్యులచే నిరుపేదలైన ముస్లిం కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా ఒడుగులు(ఖత్నా ) కార్యక్రమాన్ని ముబారక్ షాది ఖానా లో నిర్వహిస్తున్నట్లు అవాజ్ కమిటీ నాయకులు అబ్దుల్ రహిమాన్, సలాం ఖాన్, రఫీ, అబ్దుల్లా, మహబూబ్ బాషా, మునీర్, వలి, హుస్సేన్, అబ్దుల్లా కరీం, అబ్దుల్ షాకీర్, అదిల్ లు పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు కీర్తిశేషులు అబు బుకర్ తీసుకున్న నేడు నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఉచిత ఒడుగుల కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సేవ తత్వంతో జరిగే మహమ్మద్ ప్రవక్త సూచించిన ఉత్తమమైన సున్నత్ కాబట్టి నిరుపేదలైన ముస్లిం కుటుంబాలు ఉదయం 9 నుండి సాయంత్రం వర్క్ జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఆసక్తిగా ఉన్నవారు 9 4 9 2 4 0 1033, 78937 91853, 9949766 535 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సోమవారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెంపు కోసం చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, 202526 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన 2,820 మంది విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఒకే సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులు సుమారు 50 శాతం వరకు ఉన్నారని, వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తే సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని ఫెయిల్ అయిన విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి ఇప్పటినుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల్లో బాలికలు ఉంటే ప్రత్యేకంగా చైతన్యపరచి డ్రాపౌట్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలపై అధిక ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రాయితీలను తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. ఫీజులు చెల్లించలేక ప్రైవేట్ పాఠశాలల నుండి బయటకు రావాలనుకునే విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "బడి పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు, పోస్టర్లు, ప్రచార కార్యక్రమాల ద్వారా విద్యార్థుల చేరికలను పెంపొందించాలని సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గకుండా చూడాలని, ఎక్కడా పాఠశాలలు మూసివేయబడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత సంవత్సరం కంటే రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా పారదర్శకంగా పనిచేయాలని పేర్కొన్నారు. పాఠశాలలను దత్తత తీసుకున్న అధికారులు ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, వారికి మనోధైర్యం కల్పిస్తూ ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఈ సంవత్సరం మార్చి 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 12,387 మంది హాజరుకాగా, 9,567 మంది పాస్ అయ్యి 77.23 ఉత్తీర్ణత శాతం సాధించారన్నారు. వీటిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు 6 ఉన్నట్లు వెల్లడించారు. 551 నుండి 600 మధ్యలో 444 మంది, 500 నుండి 550 మధ్యలో 1,275 మంది, 500 పైగా 1,719 మంది విద్యార్థులు మార్కులను సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ ఐ-గాట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఆన్లైన్ కోర్సులను పూర్తి చేసి తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.

**బీమవరం బ్యూరో చీఫ్ మే 4 నంది పత్రిక** అర్జీలు పునరావృతం కాకుండా లబ్ధిదారుల సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను నేరుగా వినిపించుకున్నారు. ఈ రోజు నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 81 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌లో 40 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. అర్జీదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్, కొన్ని అత్యవసర అంశాలపై వెబ్ఎక్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రతి అర్జీని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి నిర్ణీత గడువులోపు పూర్తి స్థాయి పరిష్కారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్య మూల కారణాలను తెలుసుకొని, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలు మళ్లీ మళ్లీ అదే సమస్యతో అర్జీలు పెట్టాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన ఆకాశపు పద్మజ కుమార్ తనకు ఉన్న 100 సెంట్ల భూమి రీ-సర్వేలో 96 సెంట్లుగా నమోదైందని, తిరిగి సర్వే నిర్వహించి తన భూమిని తనకు అప్పగించాలని కోరారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామానికి చెందిన పిరికల దానయ్య అనారోగ్య కారణంగా కూలి పనులు చేయలేకపోతున్నానని, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. పెనుమంట్ర మండలం ఓడూరు7 గ్రామానికి చెందిన యదాల మేరి తన భర్త మృతి చెందిన నేపథ్యంలో ఆయన పేరులో ఉన్న 78 సెంట్ల భూమిని తన పేరున మార్చాలని కోరారు.పాలకొల్లుకు చెందిన దిగమర్తి కాంతం తన కుమార్తె తీవ్రమైన వ్యాధితో బాధపడుతోందని, ప్రస్తుతం పొందుతున్న పింఛన్ సరిపోవడం లేదని, పెంపు చేయాలని అభ్యర్థించారు.మొగల్తూరుకు చెందిన లంకా జాన్ తన



కుమారుడు చదువుకున్న పాఠశాల సంబంధిత "తల్లికి వందనం" పథకం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాలేదని, మంజూరు చేయాలని కోరారు.

యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామపంచాయతీ సంగటి రేవు రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే పంట బోధి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలను తొలగించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గృహగణన పక్రియను ఖచ్చితత్వంతో పారదర్శకంగా నిర్వహించాలి:

### జిల్లా జాయింట్ కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ మే 4,నంది పత్రిక** జిల్లాలో గృహ గణన ప్రక్రియను ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం గృహ గణన మరియు ఐగాట్ కర్మయోగి అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఈరోజు నుండి ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో గృహ గణన కార్యక్రమంలో పాల్గొంటున్న పరిస్థితిని మండలాల వారీగా సమీక్షించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలు, నివాస పరిస్థితులు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాల వివరాలను పూర్తిగా మరియు ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా సేకరణ జరగాలని, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రారంభ దశలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఐగాట్ కర్మయోగి పోర్టల్‌పై సమీక్షిస్తూ, జిల్లాలో ఉద్యోగుల నమోదు మరియు కోర్సుల పూర్తి శాతం తక్కువగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల్లో నమోదు శాతం పెంచేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పరిపాలనా పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఐగాట్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి కోర్సులను ఉద్యోగులు పూర్తిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. వచ్చే వారం నాటికి నమోదు శాతం గణనీయంగా పెరగాలని, ప్రస్తుతం ప్రగతిలో వెనుకబడిన జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి వై.దోసిరెడ్డి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి

## ప్రతి సోమవారం కలెక్టరేట్లో ఆయుష్ మెడికల్ క్యాంపు ఏర్పాటు సహజ చికిత్సా విధానాలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఆయుష్ వైద్యశాల ఏర్పాటు చేసిన ఆయుష్ మెడికల్ క్యాంపును సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఔషధాలను పరిశీలించి, వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. క్యాంపులో షుగర్, రక్తపోటు (బిపి), మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, మలబద్ధకం, చర్మ వ్యాధులు, థైరాయిడ్ తదితర అనారోగ్య సమస్యలకు సంబంధించిన ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నట్లు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డా.ఎ.శ్రీరామ్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ మందులను వినియోగించడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, అవసరమైతే అల్లోపతి మందులతో పాటు ఆయుర్వేద చికిత్సను కూడా అనుసరించవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం ఈ మెడికల్ క్యాంపును నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలను వినిపిస్తున్నారని, అటువంటి సందర్భాలలో వారికి ఆయుర్వేద వైద్యం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని, సహజ చికిత్సా విధానాలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ మెడికల్ క్యాంపులో అన్ని రకాల సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు అందిస్తున్నందున,



ఉద్యోగులు మరియు ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జి.గీతాబాయి, డీసీహెచ్ఎస్ డా.పి.సూర్యనారాయణ, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్లు డా.ఎ.శ్రీరామ్, డా.అశోక్ బాబు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పారిశ్రామిక మార్గదర్శక కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు వ్యాపారారంభకులకు సత్ఫలితాలను అందిస్తున్నాయి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు సంబంధిత అనుమతులు, లైసెన్సులు, విధివిధానాలపై అవగాహన పొందేందుకు పారిశ్రామిక మార్గదర్శక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భీమవరం పట్టణానికి చెందిన వ్యవసాయ రైతు కొప్పర్తి సత్యనారాయణ తేనెటీగల పెంపకం (హనీ బీస్) వ్యాపారంపై ఆసక్తి కనబరిచి, సంబంధిత శిక్షణను పూర్తి చేశారు. ఆయన కృషి విజ్ఞాన కేంద్రం ఫార్మర్స్ వర్క్‌షాప్‌లో హనీ బీస్ పెంపకం మరియు తేనె ఉత్పత్తి సంబంధిత అంశాలపై శిక్షణ పొందినట్లు తెలిపారు. తదుపరి వ్యాపారాన్ని విస్తరించేందుకు అవసరమైన లైసెన్సు పొందుటకు వశిష్ట సమావేశ మందిరంలో నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ యూనిట్ ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో పాల్గొని అనుమతుల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వశిష్ట సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పారిశ్రామిక మార్గదర్శక కేంద్రం నందు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు సమర్పించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమన్వయం చేసి, దరఖాస్తు చేసిన పది రోజులలోనే హనీ బీస్ వ్యాపారానికి సంబంధించిన లైసెన్సును మంజూరు చేయించడం జరిగింది.





ఈ సందర్భంగా కలెక్టరేట్ లో కొప్పర్తి సత్యనారాయణకు వ్యాపార లైసెన్సు పత్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక మార్గదర్శక కేంద్రం ద్వారా వ్యాపారారంభకులకు అవసరమైన మార్గనిర్దేశం, సలహాలు, ప్రభుత్వ అనుమతుల ప్రక్రియపై సహాయం అందిస్తున్నామని తెలిపారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలనుకునే యువత మరియు రైతులు ఈ కేంద్రాన్ని సంప్రదించి తమ వ్యాపారాలను ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.

# టెక్నికల్ సమస్య అధిగమిస్తాం పనులు కల్పిస్తాం: ఎంపిడిఒ



**శిరివెళ్ల:-(నంది పత్రిక)** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అంతర్జాల టెక్నికల్ సమస్యలను అధిగమిస్తామని పేదలకు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప తెలియజేశారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం భవనంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధి హామీ పనులలో నియమ నిబంధనలు ప్రభుత్వం కఠిన తరం చేసినదని తద్వారా టెక్నికల్ సమస్య తరచూ ఏర్పడుతున్నదని అర్హులైన జాబ్ కార్డు గల పేదలకు పనులు కల్పించి ఉన్న ఊరిలోనే ఉపాధి పొందేలా తగిన కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. శిరివెళ్లలో టెక్నికల్ సమస్య ఎదురైనందున ప్రభుత్వ ఆన్లైన్ నిబంధనలను అనుసరించి పనులకి బ్రేక్ ఏర్పడిందని మంగళవారం నుండి తిరిగి ఉపాధి హామీ పనులు కల్పిస్తామని.స్పష్టం చేశారు.

# టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం





**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సీట్లు కేటాయింపు**

**దేవస్థాన పాలక మండళ్లలో సభ్యులుగా అవకాశం**

**త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు**

**విద్యతోనే కురుబలు శాసించే స్థాయికి... : మంత్రి సవిత**

**కుప్పం కోడెల్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సవిత**

**ఆలయంలో ప్రత్యేక పూజలు**

**చిత్తూరు బ్యూరోచీఫ్ నంది పత్రిక** టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు దేవస్థాన బోర్డు సభ్యులగానూ కురుబలకు అవకాశమివ్వనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కేంద్రంలో జరుగుతున్న కోడెల్ల రాయస్వామి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కోడెల్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. గతేడాది జరిగిన ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేసి, ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయల కల్పించారన్నారు. కురుబల తరపున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ప్రాధాన్యం...** టీడీపీ ఆవిర్భావం నుంచి కురుబలకు రాజకీయ ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. 2014 సాధారణ ఎన్నికల్లోనూ కురుబలకు రెండు ఎంపీలు, ఒక ఎమ్మెల్యేగా సీట్లు ఇచ్చి గెలిపించుకున్నారన్నారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన తనకు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అవకాశమిచ్చి ప్రోత్సాహిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కురుబల అధికంగా ఉన్నచోట్ల టీడీపీ తరపున ఎన్నికల బరిలో దింపనున్నట్లు తెలిపారు. పలు దేవస్థాన బోర్డుల్లోనూ కురుబలకు సభ్యులుగా అవకాశమివ్వనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇలా అన్నింటా కురుబలకు టీడీపీ ప్రోత్సాహంతో రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవ వేతనాలు అందించనున్నామన్నారు. గుడి కట్ల దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

**విద్యతోనే శాసించే స్థాయికి...**

విద్యతోనే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయొచ్చునని, శాసించే స్థాయికి చేరుకోవొచ్చునని మంత్రి సవిత తెలిపారు. కురబలు తమ బిడ్డలకు ఉన్నత విద్య చదివించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. పేదలు, బీసీల విద్య కోసం అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యలో కురుబల రాణించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్సీ శ్రీకాంత్, కురబ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున. ఇతర కురుబ సామాజిక ప్రతినిధులు, వర్గీయులు అదిక సంఖ్యలో ఉన్నారు.

# జలధార - జలహారతి పనులకు వేగం పెంచాలి

### మంజూరైన పనులన్నీ క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలని ఆదేశం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, మే 4(నంది పత్రిక):-** జిల్లాలో అమలవుతున్న జలధార - జలహారతి కార్యక్రమ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సంబంధిత అధికారులతో కార్యక్రమ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార - జలహారతి కార్యక్రమ అమలులో వేగం పెంచడంతో పాటు, ప్రతి పని క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1952 పనులు మంజూరు కాగా, వాటిలో ప్రస్తుతం 1231 పనులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని తెలిపారు. 'అదర్స్' కేటగిరీలో సుమారు 400 పనులు యాప్‌లో సరిగా ప్రతిబింబించడం లేదని, ఆ సాంకేతిక సమస్య పరిష్కారమైతే గ్రౌండింగ్‌లో ఉన్న పనుల సంఖ్య 1600 దాటుతుందని వివరించారు. పెండింగ్లో ఉన్న పనులను కూడా తక్షణమే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. స్ట్రక్చర్ ప్లాన్లలో 90 శాతం పూర్తవగా, విలేజ్ ప్లాన్లు 73 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. జిల్లాలోని 330 చెరువులు, 191 గ్రామాలకు సంబంధించిన ట్యాంక్ ప్లాన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఇంకా సుమారు 2,500 స్ట్రక్చర్లను పరిశీలించాల్సి ఉందని, అవి పూర్తయిన తర్వాతే విలేజ్ ప్లాన్లు అప్లోడ్ అవుతాయని స్పష్టం చేశారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమయానికి కేటాయించిన ప్రతి పని క్షేత్రస్థాయిలో అమలు కావాలని, సంబంధిత అధికారులు గ్రామస్థాయికి వెళ్లి ఫోటోలు, జియో కోఆర్డినేట్లు సేకరించి యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కొలిమిగుండ్ల మండలం హనుమంతుగుండం చెరువు పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు 18 కిలోమీటర్ల కాలువ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో 14.5 కిలోమీటర్లకు అనుమతులు లభించగా, మిగిలిన 3.5 కిలోమీటర్ల పనులకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు చేయలేని పనులకు స్వచ్ఛంద మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. చెరువులు, కాలువల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని, ఒక ప్రాంతంలో విజయం సాధిస్తే మిగిలిన 27 చెరువుల గొలుసుకట్టు పనులకు కూడా ఇది ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** జిల్లాలో అమలవుతున్న జల జీవన్ మిషన్ (జీజీవీ) పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు ఆదేశించారు. పైపులైన్ నిర్మాణాల అనంతరం తవ్విన ప్రాంతాలను సమంగా చేసి రోలింగ్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఆర్ & బి, ఆర్‌డబ్ల్యూఎస్, మరియు ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ మెగా కంపెనీ ప్రతినిధులతో కలిసి తీరప్రాంత గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన 16 మండలాల పరిధిలో 862 గ్రామాలకు ఈ ప్రాజెక్ట్ అమలు జరుగుతోందని తెలిపారు. సుమారు రూ.1400 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 13.25 లక్షల కుటుంబాలకు శుద్ధమైన తాగునీటి సౌకర్యం కల్పించబడనుంది. ప్రాజెక్ట్ భాగంగా మొత్తం 2,662 కిలోమీటర్ల మేర పైపులైన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, ఈ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా జిల్లాలో కొత్తగా నిర్మాణంలో ఉన్న రహదారుల ప్రాంతాల్లో ముందుగానే పైపులైన్ పనులను పూర్తి చేయాలని, తద్వారా భవిష్యత్తులో రోడ్లు మళ్లీ తవ్వాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పైపులైన్ వేసిన తర్వాత తవ్విన మట్టిని యథాతథంగా చదును చేసి, రోలింగ్ ద్వారా రహదారి స్థితిని పునరుద్ధరించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్ సంస్థలదేనని స్పష్టం చేశారు. అలాగే జాతీయ రహదారులు, ఆర్ & బి రోడ్లు, గెయిల్ పైప్‌లైన్ క్రాసింగ్ ప్రాంతాల్లో పనులు చేపట్టే సమయంలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పైపులైన్ మార్గంలో ఉన్న ఆక్రమణలను



తొలగించేందుకు రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనులు నిర్ణీత గడువులో పూర్తి కావడమే కాకుండా నిర్మాణ నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ మెగా కంపెనీ ప్రతినిధులు ప్రస్తుత పనుల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ అధికారి టి.శ్రీనివాసరావు, డిఈ ఎ.శ్రీనివాసరావు, జిల్లా ఆర్ & బి అధికారి శ్రీనివాసరావు, మెగా కంపెనీ డిపిఎం దుర్గాప్రసాద్, ఎస్.అంకాలయ్య, నేషనల్ హైవేస్ ప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో... ముఖహాజరుకు ముప్పతిప్పలు

**నంద్యాల రూరల్, మే4(నంది పత్రిక):-** ఉపాధి హామీ పథకంలో శ్రామికుల హాజరుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఐరిస్ విధానం కష్టజీవులకు చుక్కలు చూపిస్తోంది. ఐరిస్ సక్రమంగా నమోదవకపోవడంతో పలువురు శ్రామికులు పనులకు దూరమవుతున్నారు. మరికొంతమంది పనులు చేసినా.. యాప్లో నమోదవక పోవడంతో వేతనాన్ని కోల్పోతున్నారు. పలు మండలాల్లో పనిప్రదేశాలకు సెల్ సంకేతాలు అందడం లేదు. దీంతో వివరాలు అప్లోడ్ చేసేందుకు సిబ్బంది వ్యయప్రయాసలు పడుతున్నారు. పని చేసినా యాప్లో నమోదవడం లేదని శ్రామికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ-కేవైసీ ఉంటేనే పనులకు** గతంలో ఉపాధిహామీ పనులు చేసేటప్పుడు జాబ్కార్డులో ఒకరుంటే వారికి బదులు మరొకరు పనులకు వెళ్లి మస్టర్లో దొంగ సంతకాలు చేసేవారు. దీనివల్ల నిధులు దుర్వినియోగం అయ్యేవి. దీంతో దొంగసంతకాలు చేయడానికి వీలు లేకుండా ప్రభుత్వం పనులకు హాజరయ్యే ప్రతి కూలీ ఈ-కేవైసీ పక్కాగా చేసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అవగాహనారాహిత్యం కారణంగా ఈ-కేవైసీ అంతంతమాత్రంగానే పూర్తయింది. దీంతో పాటు పని ప్రదేశాల్లో టవర్ సిగ్నల్ లేకపోవడంతో ఫొటోలు యాప్లో అప్లోడ్ అవ్వడంలేదు. రోజంతా పనిచేసినా వేతనం అందడంలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఒక్కటి మర్చిపోయినా** పనుల వద్ద కూలీలకు ఐడీని క్రియేట్ చేస్తారు. మొదట క్షేత్ర సహాయకులు కూలీల ఫొటో తీస్తారు. పని పూర్తయిన నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు వారికి సమాచారం అందుతుంది. ఈ నిబంధనల్లో ఏదీ మర్చిపోయినా బిల్లులు జమకావు.



# ఎడప్పాడి నుంచి 98 వేల మెజార్టీతో పళనిసామి విజయం.. ఇక్కడ పోటీలో లేని విజయ్ పార్టీ

అన్నాడీఎంకే పార్టీ అధినేత పళనిసామి సేలం జిల్లాలోని ఎడప్పాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. సమీప స్వతంత్ర అభ్యర్థి ప్రేమ్ కుమార్‌పై 98,110 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పళనిసామికి 1,48,933 ఓట్లు రాగా, స్వతంత్ర అభ్యర్థికి 50,823 ఓట్లు వచ్చాయి. ఇక్కడ డీఎంకే అభ్యర్థి 44,011 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు.

అవసరమైనన్ని ప్రతిపాదిత సంతకాలు లేకపోవడంతో ఇక్కడ టీవీకే పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు.

పార్టీ తరఫున వేసిన డమ్మీ అభ్యర్థి నామినేషన్ కూడా ఇదే కారణంతో తిరస్కరించబడింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పళనిసామి డీఎంకే అభ్యర్థి సంపత్ కుమార్‌పై 93,802 ఓట్ల మెజార్టీతో, 2016లో పీఎంకే నాయకుడు అన్నాదురైపై 42,022 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.



# సీఎం పీజిఆర్ఎస్ దరఖాస్తులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలి

## క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి ప్రజలకు పూర్తి సంతృప్తి కలిగించాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ చాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సీఎం కార్యాలయానికి సంబంధించిన పీజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యక్షంగా దరఖాస్తుదారులతో మాట్లాడారు. ప్రజలకు అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారంలో అధికారులు చూపుతున్న స్పందనను సమీక్షించారు. ఈ సందర్భంగా ఐదుగురు దరఖాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారి సమస్యలు ఏ విధంగా పరిష్కరించబడ్డాయో, వారు సంతృప్తిగా ఉన్నారో లేదో వివరంగా ఆరా తీశారు. పెనుగొండ మండలం చిన్నమల్లం గ్రామానికి చెందిన సిహెచ్. సుబ్రహ్మణ్యం అంగన్వాడి భవనం, గ్రామ రహదారులు, వాటర్ గ్రిడ్ అంశాలపై చేసిన దరఖాస్తులు పరిష్కరించబడ్డాయని తెలియజేస్తూ, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉండి మండలానికి చెందిన ఎస్. దేవి ప్రసన్న హౌస్ టాక్స్ సమస్యపై చేసిన వినతి తక్షణమే పరిష్కరించబడిందని, తాను ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన దరఖాస్తుదారు గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం కోసం చేసిన వినతిపై స్పందించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న నిధులతో రోడ్డు పనులను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన గ్రంధి దుర్గ ఇంటి స్థలం కోసం చేసిన దరఖాస్తుపై సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీజిఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తు ప్రజల ఆశలను ప్రతిబింబిస్తుందని, వాటిని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని తెలిపారు. అధికారులు ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నాణ్యమైన మరియు స్థిరమైన పరిష్కారం అందించాలన్నారు. అంతేకాకుండా, సమస్య పరిష్కారం అనంతరం దరఖాస్తుదారుని సంతృప్తిని నిర్ధారించుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి పారదర్శకత, వేగం, నాణ్యత అనే మూడు అంశాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# భారతదేశంలోనే అతి పెద్ద స్టార్టప్ టీ హబ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

## వైయస్సార్ కడప జిల్లాలో త్వరలో ప్రారంభించనున్న స్టార్ట్ అప్ కడప నేపథ్యం లో హైదరాబాద్ గచ్చిబౌలి లోని స్టార్టప్ టీ హబ్ ను సందర్శించి అధ్యయనం చేసిన ఆస్పిరేషన్ డిస్టిక్ బృందం సభ్యులు



**వైయస్సార్ కడపబ్యూరో చీఫ్ మే 4నంది పత్రిక :** ప్రపంచంలోనే అతి పెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్(హైదరాబాద్ గచ్చిబౌలిలోని)అయిన టీ హబ్ ను వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం సందర్శించారు.. వైయస్సార్ కడప జిల్లా లో రాయలసీమ ప్రాంతంలోని యువత కు కొత్త ఆవిష్కరణలకు మరియు ఉపాధి, అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో త్వరలో ప్రారంభించనున్న స్టార్ట్ అప్ కడప ద్వారా కొత్త ఆవిష్కరణలకు వేదిక కానున్న నేపథ్యంలో..... ఈ అంశంపై మరింతఅధ్యయనం కోసం హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీ హబ్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సందర్శించారు. టీ హబ్ సందర్శన లో భాగంగా స్టార్టప్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువెళ్లడం, వ్యవసాయ,ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ కంపెనీలు, ఐటి, రంగాలలో కొత్త వ్యాపార ఆలోచనలతో వ్యాపారాన్ని విస్తరించాలను కొనేవారికి అవసరమైన సహాయ సహకారాలు అనుభవజ్ఞులైన నిపుణుల ద్వారా వ్యాపార మెలుకువలు సంబంధిత అంశాలను టీ హబ్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట స్టెప్ సీఈఓ విజయ్ కుమార్, ఆస్పిరేషన్ డిస్టిక్ బృందం సభ్యులు కలరు

# రాజానగరంలో పల్లెనిద్ర. చట్టాలపై అవగాహన.



**శిరివెళ్ల (నంది పత్రిక):–** సిరివెళ్ల మండల పరిధిలోని రాజనగరం గ్రామంలో శిరివెళ్ల పోలీస్ స్టేషన్ అధికారులుపల్లెనిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు నిర్వహిస్తున్న పల్లెనిద్ర కార్యక్రమంతో ప్రజలకు మరింత భరోసా కల్పిస్తున్నామని ఎస్సై మదు సూదన తెలిపారు. సోమవారం రాత్రి శిరివెళ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని గాంధీనగరం,రాజానగరం గ్రామాలకు సంబంధించిన ప్రజలతో రాజనగరం గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పల్లె నిద్ర కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని కలిగిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయడమే పల్లె నిద్ర ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు పెద్ద నేరాలుగాను, శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశముందని, ఇలాంటి అంశాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, చర్యలు చేపడు తున్నామన్నారు. పోలీసు స్టేషన్ కు వెళ్ళకుండానే వారి సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలిపేందుకు పల్లెనిద్ర' ఒక వేదికగా నిలుస్తుంద న్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విషయాలను, గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల మధ్యగల విభేదాలను, భూతగాదాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు, ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలు, సైబరు మోసాలు, బాల్యవివాహాలు, రహదారి భద్రతపట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్సై మదు సూదన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి సుబ్బారావు,శాఖమూరి అంజయ్య,శృంగవరపు సుబ్రమణ్యం, అడుసుమిల్లి లక్ష్మణరావు,కోనేరు రాఘవేంద్ర రావు, నారిశెట్టి శంకర్,మావిడు వేణు, బొబ్బ నాగేశ్వరరావు,ఆలపాటి పూర్ణచంద్రరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 4 నంది పత్రిక** ఆళ్లగడ్డఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విజయవాడలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో, రాష్ట్ర మంత్రి నారా లోకేషను సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలనూతనంగా టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి నారా లోకేష్ను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆళ్లగడ్డ అభివృద్ధి గురించి, మరియు పలు సమస్యలపై మంత్రినారా లోకేష్ కు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వివరించారు.

# అరటిపంట దిగుబడులకు ఆదరణ




**మహానంది, మే 04 (నంది పత్రిక):–** అరటి పంట దిగుబడులకు మార్కెట్లో మంచి ఆదరణ ఉంటుందని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ ప్రియాంక సర్కార్,ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మూల ప్రతాపరెడ్డిలు పేర్కొన్నారు.సోమవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని అరటి ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కార్యాలయం వద్ద క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండ్‌గ్యాప్ పొలంబడి సర్టిఫికేషన్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆఫీస్ ఆడిట్ నిర్వహించి, ఇండ్‌గ్యాప్ ప్రమాణాల ప్రకారం పంటల, రికార్డుల నిర్వహణ, నాణ్యత నియంత్రణ వంటి అంశాలను పరిశీలించారు.అరటి పంట దిగుబడి, ఎగుమతి అవకాశాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్ అంశాల గురించి,వరి పొలాల్లో గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ గ్యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ.. ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా రైతులకు అధిక అవకాశాలు లభిస్తాయన్నారు. పండ్ల పంటలకు గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలకు సమానమైన నాణ్యతను సాధించడానికి బెంచ్‌మార్క్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. ఏపీ ఎస్ ఓ పి సి ఎ, వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పురుగుమందుల అవశేషాలు లేని సురక్షితమైన ఆహార ఉత్పత్తులను వినియోగ దారులకు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఎఫ్‌పీఓలను డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లో చేర్చి మార్కెట్ లింకేజెస్ మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ ఆడిట్ కార్యక్రమం రైతులకు నూతన మార్కెట్ అవకాశాలు, ఎగుమతి మార్గాలు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.రైతులకు సర్టిఫికెట్లు ఉంటే మంచి గుర్తింపు ఉంటుందన్నారు.అరటి, పసుపు పంటలను ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్‌లో నమోదు చేయడానికి రైతులు ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, ఎఫ్‌పీఓ ఛైర్మన్, ఆర్గానిక్ ఇన్‌స్పెక్టర్లు బి. తరుణ్ రెడ్డి, ఆర్‌వి సునీల్ కుమార్ రెడ్డి, ఎవాల్యువేటర్ అష్రఫ్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్ర శేఖర్, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన కౌన్సిలర్.



**కేసముద్రం, మే 04(నంది పత్రిక)**:కేసముద్రం మున్సిపల్ పరిధిలోని కేసముద్రం విలేజ్ కి చెందిన ఎన్టీఆర్ నగర్ లోని జాటోత్ అమ్మి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి సోమవారం 16వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కీర్తి సురేందర్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కత్తెరశాల శ్రీనివాస్, నాయకులు వల్లందాస్ రవి, పోలేపాక నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కీర్తి శ్రీలత, సోసకండ్ల సుభాష్ రెడ్డి, అజ్మీర రమేష్, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తి సురేందర్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటున్న శాసన సభ్యులు భూక్య మురళి నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# మోదీ పాలనపై ప్రజల్లో చెరగని నమ్మకం..!

## -మూడు రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం.

## - కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి.



**నంద్యాల ప్రతినిధి. నంది పత్రిక.మే 04.**దేశంలో జరిగిన ఐదు రాష్ట్రల ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతాపార్టీ మూడు రాష్ట్రలలో ఘన విజయం సాధించడం నరేంద్ర మోదీ పాలన మీద ప్రజలకు ఉన్న నమ్మకమే నేటి ఎన్నికల ఫలితాలు బిజెపి ఘన విజయానికి నిదర్శనం అని బిజెపి కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజ్జం సుబ్బారెడ్డి మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ పాలనలో అత్యాచారానికి గురైన సాధారణ కుటుంబానికి చెందిన యువతి అత్యాచారానికి గురి అయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనకు చలించిన నరేంద్ర మోడీ ప్రాణాలు కోల్పోయిన యువతి తల్లికి అసెంబ్లీ బిజెపి సీటు కేటాయించి ఒక నిరుపేద కుటుంబానికి చెందిన మహిళను ఎమ్మెల్యే గా గెలిపించిన ఘనత నరేంద్ర మోడీ దని అన్నారు. భారతదేశ చరిత్రలో 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి తో మొదలైన బిజెపి హవా నేటి నరేంద్ర మోడీ పరిపాలన వరకు అంచాలంచలుగా బిజెపి ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందని అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ అధికారం అడ్డుపెట్టుకొని నియంత పాలన కొనసాగించడంతో పాటు ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చెయ్యడంతో బెంగాల్ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలంటే నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి పార్టీ అధికారంలోకి రావడమే సరైన నిర్ణయం అని భావించి 184 సీట్లు గెలిపించి అధికారం కట్టబెట్టారు అని అన్నారు. ఈ సందర్భంగా ఘన విజయం అందించిన మూడు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో భారతదేశంలో బిజెపి శాశ్వత పార్టీగా పరిపాలన కొనసాగించడం ఖాయమని అన్నారు. రాష్ట్రల అభివృద్ధి జరగాలన్న, ఉద్యోగ ఉపాధి, పరిశ్రమలు, ఆర్థికాభివృద్ధి, దేశం పురోగతి చెందాలన్న కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి పరిపాలన కొనసాగించాల్సిన అవసరాన్ని మూడు రాష్ట్రల ప్రజలు గమనించారని, అందుకే బిజెపి ఘన విజయానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. భవిష్యత్తులో బిజెపి మరింత బలపడే దిశగా పయనిస్తుందని, గత రెండు నెలల క్రితం ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ దేశాలలో నెలకొన్న యుద్ధ వాతావరణం పరిస్థితులలో ఇతర దేశాలు ఆర్థిక అసమానతలకు, పెట్రోల్, డీజల్, గ్యాస్ వంటి నిత్యావసర ఇంధనముల కొరతతో విలవిలాడినప్పటికీ మనదేశానికి ఎలాంటి ఇంధన కొరత లేకుండా సరఫరా చేయించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కింది అని అన్నారు. ప్రపంచంలో భారతదేశ శక్తిని నలుమూలలకు చాటిన ఘనత కూడా నరేంద్ర మోడీదే అని అన్నారు. గ్రామీణ స్థాయి నుండి పట్టణ నగర స్థాయి వరకు నేటి అత్యాధునిక సాంకేతిక రంగాలలో పేద వర్గాల మహిళలనుండి ధనిక వర్గాల వరకు సమాంతర అభివృద్ధి జరుగుతుందంటే అది నరేంద్ర మోడీ ఆలోచన విధానంతోనే సాధ్యమని అన్నారు. భవిష్యత్తులో దేశ పురోగతి బిజెపికే సాధ్యమని అన్నారు.

# రహదారులపై మొక్కజొన్న ఆరబెడితే చర్యలు: ఎస్సై



**మహానంది మే 04 (నంది పత్రిక):–** రహదారులపై మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను ఆరబెడితే చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మహానంది – బోయలకుంట్ల రహదారిలో మొక్కజొన్న ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు.. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు అన్నారు. రహదారిపైనే మొక్కజొన్న, ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రైతులు గమనించి, సహకరించాలని కోరారు. సాధ్యమైనంతవరకు తమ పంటలను పొలాల్లోనే ఆరబెట్టుకోవాలని సూచించారు.

# తమిళనాడులో ఓటమిపై స్పందించిన స్టాలిన్

ఆయన ఓటమిని అంగీకరించారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని అన్నారు. విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు. డీఎంకే ఇక నుంచి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రభావవంతమైన ప్రతిపక్షంగా పనిచేస్తుందని అన్నారు. గత ఐదేళ్ల తమ పాలనలో ప్రజల కోసం ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని, సుపరిపాలన అందించామని అన్నారు.

ఇన్నాళ్లు సమర్థవంతంగా పాలన అందించామని, ఇక నుంచి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను చూపించి ప్రజలను ఓట్లు అడిగామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని కొనసాగిస్తామని హామీ కూడా ఇచ్చామని అన్నారు. కానీ తీర్పు తమకు అనుకూలంగా రాలేదని అన్నారు.

# కేరళలో ఎల్డీఎఫ్ కూటమి దారుణ ఓటమి... ముఖ్యమంత్రి పదవికి విజయన్ రాజీనామా

కేరళ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయానికి తెరపడింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కూటమి ఎన్నడూ లేనంతటి ఘోర పరాజయం చవిచూడటంతో, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం రాత్రి ఆయన గవర్నర్ రాజేంద్ర వి. అర్లేకర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని విజయన్‌ను గవర్నర్ కోరారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 స్థానాల్లో గెలవగా, అధికార ఎల్డీఎఫ్ కేవలం 35 సీట్లకే పరిమితమైంది. బీజేపీ మూడు స్థానాల్లో విజయం సాధించింది.

# హజ్ కు బయలుదేరిన185 మంది ఏపీ యాత్రికులు

## హైదరాబాద్ హజ్ క్యాంపు వద్ద వీడ్కోలు పలికిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్

## ఆధునిక వసతులు కల్పించిన ప్రభుత్వానికి హాజీల కృతజ్ఞతలు

**అమరావతి, మే 04. నంది పత్రిక:** హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం శంషాబాద్ విమానాశ్రయం నుండి 185 మంది ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన యాత్రికులు హజ్ యాత్రకు సోమవారం బయలుదేరి వెళ్లారు. విడిది కేంద్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన హాజీల తరలింపు వాహనాలను మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు యమ్ఏ షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ భాష, సభ్యులు, సీఈఓ గౌస్ పీర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు మొదటి విమానం, ఆ తర్వాత రెండు విమానాల్లో మొత్తం 185 మంది యాత్రికులు హజ్ కు బయలుదేరి వెళ్లినట్లు మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేసిన వసతి విడిది కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ కు చెందిన యాత్రికులకు కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఏపీ నుంచి 1202మంది యాత్రికులు హజ్ కు వెళ్లేందుకు హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం ఎంపిక చేసుకోవడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వీరందరూ ఈనెల 21వ తేదీ వరకు దశలు వారిగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర హజ్ యాత్రికులకు ఇతర రాష్ట్రాలలోని ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా విడిది వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విడిది, భోజన, ప్రార్థన వసతులతో పాటు వైద్య శిబిరాలు, కరెన్సీ మార్పిడి, వీసా పత్రాల పరిశీలన, బోర్డింగ్ పాసుల జారీ తదితర అంశాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి విశదీకరించే ఏర్పాట్లు, సహాయ సహకారాల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.గత నెల 18,19 వ తేదీలలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం గన్నవరం విమానాశ్రయం నుంచి పవిత్ర హజ్ యాత్రకు 333 మంది యాత్రికులు వెళ్లిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ఏంబార్కేషన్ కేంద్రం సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి విడిది సౌకర్యాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా, ఘనంగా జరిగాయని హజ్ యాత్రకు వెళ్తున్న హాజీలు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



నంది పత్రిక
మంగళవారం 05 - 05 -2026

# రైతు కన్నీరు పెడితే రాజ్యం ఏమవుతుంది..?

## మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ నిలదీత.

**కేసముద్రం, మే 04(నంది పత్రిక):** ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు కన్నీరు పెట్టిన రాజ్యం ఎన్నటికీ బాగుపడదని మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వారి గోడును విని, ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తీరుపై శంకర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయాలకు తాళాలు వేసి, రైతులను బయట అమ్ముకోమని అధికారులు చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. "ప్రభుత్వ మార్కెట్లు మూసేస్తే రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలని నిలదీశారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ట్రాక్టర్ వరి ధాన్యానికి ఏకంగా 30 కేజీల తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే బస్తాలను ఇప్పుడు రైతుల చేతే కొనిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట విలువలో 1 శాతం కట్ చేసుకుని, డబ్బుల కోసం 10 రోజులు వేచి చూసేలా చేస్తున్నారని చెప్పారు. పాలకవర్గం, అధికారులు ఈ దోపిడీని చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేసముద్రం రైతుల పంటను త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను తీర్చకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, రైతులకు న్యాయం జరిగే వరకు వెనుతిరిగే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, మర్రి రంగారావు, మండల మాజీ అధ్యక్షులు మహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు వీరు నాయక్, వార్డు కౌన్సిలర్లు వినయ్ రెడ్డి, దూదేపాక కృష్ణ, సర్పంచులు ఈసం లక్ష్మీనారాయణ, ఎదరబోయిన సూరయ్య, బోడ వీరన్న, ఏర్పుల కుమారస్వామి, కందునూరి మహేష్, అంకుష్, తోట శ్రీను, హరినాయక్, రవీందర్ రెడ్డి, హుస్సేన్ నాయక్, నాగుల్ మీరా, పాషా, బానోత్ వెంకన్న, గణేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.




# బెంగాల్‌లో పాగా వేసిన బిజెపి

**205 సీట్లతో భారీ విజయం నమోదు**

**మట్టి కరిచిన మమతా బెనర్జీ టిఎంసి**

**వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం**

బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10–15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30–60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశిరచారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు

మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణెళి లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది. 2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు క్లళెం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభాండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమత సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి. ఉత్తర బెంగాల్‌పై పట్టు బిగించి.. సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు. శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100? కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి. పశ్చిమబెంగాల్‌లో 'బయటవారు' అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు. ఇలా వ్యూహాత్మకంగా మమతను దెబ్బకొట్టారు.

## బిజెపి కార్యకర్తల కఠోర శ్రమ ఫలితం

పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి విజయం దక్కిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. రాష్ట్ర బీజేపీ కార్యకర్తలను అభినందించారు. వారి కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. మంచి పాలన అందించాలన్న బీజేపీ అభిమతమే అంతిమంగా పైచేయి సాధించిందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు బీజేపీకి అద్భుతమైన విజయాన్ని అందించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ విజయం కోసం రాష్ట్రంలో పార్టీకి చెందిన కొన్ని తరాల కార్యకర్తలు నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. కొన్నేళ్ల పాటు క్లిష్ట పరిస్థితుల్లో పోరాడారని అన్నారు. కార్యకర్తలే పార్టీ శక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్తకూ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. బీజేపీకి మర్చిపోలేని విజయం అందించినందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని కూడా ప్రధాని మోదీ చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశలను, కలలను సాకారం చేసేందుకు బీజేపీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవం దక్కేలా పాలన అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

## బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమకొండలో

జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. 'వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు.

కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకుపోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మాట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే.

కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

## అకాల వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తం

అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.2001.96 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. రానున్న 3 నుంచి 4 రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలులు, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నల్గొండ, నిజామాబాద్ జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైనన్ని తార్పాలిన్లు (పాలీథిన్ కవర్లు) సిద్ధంగా ఉంచాలి. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి' అని అన్నారు.

## నటులు తలచుకుంటే చరిత్ర సృష్టిస్తారు

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు ఎన్నికల ఫలితాలపై హిందూపురం ఎమ్మెల్యే, నందమూరి బాలకృష్ణ స్పందించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో విజయం సాధించిన బీజేపీ, ఎన్డీఏ కూటమి పార్టీలకు బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సారథ్యంలోనే నూతన భారత నిర్మాణం సాధ్యం అవుతుందని అన్నారు. ఈ ఘన విజయాన్ని సాధించిన ఎన్డీఏ కూటమికి విజయాభినందనలు తెలియజేశారు. మరోవైపు తమిళనాడు ఎన్నికల ఫలితాలపై బాలయ్య స్పందిస్తూ తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావును స్మరించుకున్నారు. నటుడు తలచుకుంటే చరిత్రను తిరగరాయగలడని తమిళనాట ఎంజీఆర్, తెలుగునాట ఎన్టీఆర్ నిరూపించారని గుర్తు చేశారు. మళ్లీ ఆ ప్రభంజనాన్ని స్ఫురణకు తెచ్చిన సోదరుడు విజయ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళ ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చటమే లక్ష్యంగా ముందుకు సాగాలని బాలకృష్ణ అభిలషించారు.

## పొలంలో మొక్క జొన్న పంట దగ్ధం



**బేతంచెర్ల మే 4 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామం లో కౌలురైతు గోనేల తిమ్మరాజు 6 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశారు. అందులో 2ఎకరాలు మూడురోజులక్రీతం కోత కోశారు. మిగిలిన నాలుగు ఎకరాలు గాలికి కింద పడి నందువల్ల కూలీలతో కంకులు వీడిపించి 10 ట్రాక్టర్ లు కుప్పపోశారు.మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిచారు.ట్రాక్టరు తో సహ 4 ఎకరాల మొక్కజొన్న కాలిపోయింది. గ్రామస్థులు ఎంత ప్రయత్నం చేసిన మంటలు అదుపులోకి రాకపోవడంతో పైరింజన్ తో మంటలు అదుపు చేశారు.దాదాపు 12 లక్షలు రూపాయల నష్టం వాటిల్లందని రైతు తెలిపారు.ప్రభుత్వం సహాయంచేసి ఆదుకోవాలని కోరారు.

## కాయితోజు లక్ష్మిసోమన్న గృహ ప్రవేశానికి హాజరైన చిలువేరు సమ్మి గౌడ్.



**కేసముద్రం, మే 04(నంది పత్రిక):** మిత్రులు, కుటుంబసభ్యులు కాయితోజు లక్ష్మిసోమన్న దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మి గౌడ్ తన సోదరుడు సాయి గౌడ్ తో కలిసి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మి గౌడ్ గృహ యజమానుల కుటుంబ సభ్యులను పట్టు వస్త్రాలతో ఘనంగా సత్కరించి, వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఆయన అందించిన పట్టు వస్త్రాలు కేవలం బహుమతిగా కాకుండా, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచాయి. అనంతరం పూజ కార్యక్రమాలను ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. వ్రతాంతరంలో స్వామివారి తీర్థప్రసాదాలను వినమ్రంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఇలాంటి శుభసందర్భాల్లో పరస్పరం ఆనందాన్ని పంచుకోవడం మన సంస్కృతికి అద్దం పడుతుంది. మన మధ్య ప్రేమాభిమానాలు, సేవా భావం పెరిగితే సమాజం మరింత బలపడుతుంది. ఈ నూతన గృహంలో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం నిండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన గృహానికి ఆశీస్సులు అందజేశారు. వేడుక అంతా ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

## కల్వల రైతు వేదికలో రైతు వారోత్సవాలు ప్రారంభం



**కేసముద్రం, మే 04(నంది పత్రిక):** కేసముద్రం మండలం కల్వల రైతువేదికలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి శనివారం వరకు జరిగే రైతు వారోత్సవాలలో భాగంగా రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేసముద్రం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ విధానం, దాని ప్రాముఖ్యత, జీవన ఎరువులు ట్రైకోడర్మ, సూడొమోనాస్ ప్రాముఖ్యత, వాడే విధానం, తొలకరి వానలు పడగానే పచ్చిరొట్ట ఎరువులు, జీలుగలు, జనుము, పెసర వంటివి వేసి పూతదశలో దున్నితే నేలల్లో సేంద్రయ శాతం పెరుగుతుందని, వరి, మొక్కజొన్న, పత్తి కొయ్యకాలు పంట వ్యర్థాలు కాల్చకుండా రోటవేటర్ తో దున్నుకున్నట్లయితే సేంద్రియ కార్బనం పెరుగుతుందని, అధిక రసాయన ఎరువులు, మందులు తగ్గియ్యడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమవుతుందని, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టి ఎరువుల సమతుల్యత దెబ్బతినకుండా, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, నానో యూరియా, నానో డిఏపి ల ప్రాముఖ్యత, రాబోయే వానాకాలం వరి విత్తన రకాల ఎంపిక మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచుకొని, మంచి దిగుబడి పొంది ఆదాయం పెంచుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపులని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, ఉప సర్పంచ్ పెదగాని రవి, రైతు నాయకులు ఆకుల సుధాకర్, పెరటి వెంకట్రాం నర్సయ్య, చింతనూరి రమేష్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి విజయంతో శ్రేణుల సంబరాలు

**కేసముద్రం, మే 04(నంది పత్రిక):** సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ బెంగాల్, అస్సాం, మిజోరంలలో పూర్తి మెజారిటీని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న శుభ సందర్భంగా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన బిజెపి శ్రేణులు మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వర చారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి గుడి సెంటర్లో సోమవారం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన వైఫల్యంతో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి పట్టం కడతారని ఆశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి భోనగిరి ఉపేందర్, మండల ఉపాధ్యక్షురాలు నాగనబోయిన చంద్రకళ, వెలిశాల సవీన్, బచ్చు లక్ష్మీనారాయణ, బానోత్ సంపత్, మంగిశెట్టి నాగయ్య, బొద్దుల సురేందర్, శ్రీకాంత్ తవిడిశెట్టి రవీందర్, ఓలం వీరభద్రరావు, బానోత్ రాము పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com